



ఓఆర్ఆర్ ఆమోదం.. బైపాస్ రద్దు

ట్రాఫిక్ కష్టాలు తీరేలా.. ఎయిర్‌పోర్టు కు ఉమ్మడి గుంటూరు జిల్లావాసులు సులభంగా చేరేలా.. రాజధాని అమరావతి అభివృద్ధిలో కీలకమైన ప్రాజెక్టుగా ఉన్న విజయ వాడ తూర్పు బైపాస్‌ను కేంద్రం రద్దు చేసింది. రాజధాని అమరావతికి చుట్టూ ఔటర్ రింగు రోడ్డు మం జూరు చేసిన కేంద్ర ప్రభుత్వం ఇక తూర్పు బైపాస్ అవసరం లేదని తేల్చేసింది. గతంలో కేంద్రమంత్రి నితిన్‌గడ్కరీ తూర్పు బైపాస్‌కు ఆమోదం తెలిపి ప్రత్యేకంగా నిధుల ను కూడా కేటాయించారు. బైపాస్ నిర్మాణానికి అలైన్‌మెంట్ కూడా ఖరారు చేశారు. ఇక భూ సేకరణ పనులు ప్రారంభ మవుతాయ నుకుంటున్న సమయంలో తాజాగా మంజూరైన ఓఆర్ఆర్ పేరుతో తూర్పు బైపాస్‌ను రద్దు చేయడం ఉమ్మ డి గుంటూరు, కృష్ణా జిల్లాల ప్రజలను కలవరపెడుతోంది. ఓఆర్ఆర్, తూర్పు బైపాస్ పక్కపక్కగా వస్తాయి.. ఇక బైపాస్ అవసరం లేదని కేంద్రం చెప్పడం భావ్యం కాదని.. అలైన్‌మెంట్ మారిస్తే సరిపోయే దానికి రద్దు చేయడం సరికాదని ఇటు గుంటూరు, అటు విజయవాడ వాసులు అభిప్రాయ పడుతున్నారు.

- ఆచరణకు నోచుకోని కేంద్ర మంత్రి గడ్కరీ హామీ
- విజయవాడ తూర్పు బైపాస్‌కి రూ.2,176 కోట్లు కేటాయించినా రద్దు
- ట్రాఫిక్ కష్టాలు ఇప్పట్లో తొలగే అవకాశం లేదని గుంటూరు, కృష్ణా జిల్లా వాసుల ఆందోళన
- తూర్పు బైపాస్ రద్దుతో ఎయిర్‌పోర్టు కనెక్టవిటీపై ప్రభావం
- ఎన్‌హెచ్- 16తో ట్రాఫిక్ కష్టాలు.. వెస్ట్ బైపాస్‌తో 10-15 కి.మీ. అదనపు ప్రయాణం


గుంటూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి, గుంటూరు, విజయవాడను అనుసంధానించే అత్యంత కీలకమైన రహదారుల నిర్మాణంపై తాజా పరిణామాలు ప్రజల్లో నిరాశను కల్పిస్తున్నాయి. రాజధాని అమరావతికి చుట్టూ ఔటర్ రింగు రోడ్డు మంజూరైన సంతోషం మిగలకుండా, అప్పటికే మంజూరైన విజయవాడ తూర్పు బైపాస్‌ను రద్దు చేయడం రెండు జిల్లాల ప్రజలను తీవ్ర నిరాశకు గురి చేస్తోంది. రాజధానికి అనుబంధంగా ఉన్న ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లాల ప్రజల రవాణా అవసరాల్లో అత్యంత కీలకమైన ఈ బైపాస్ రద్దుతో ట్రాఫిక్ కష్టాలు ఇప్పట్లో తొలగే అవకాశం లేదని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గుంటూరు, విజయవాడ నగరాల మీదగా వెళ్లే అత్యంత కీలకమైన చెన్నై- కోల్‌కతా జాతీయ రహదారి ఎన్‌హెచ్- 16 ట్రాఫిక్ పద్మవ్యూహంగా మారింది. ఈ రహదారి విజయవాడ బెంజిసర్కిల్, మహానాడు జంక్షన్, రామవరప్పాడు రింగు, రామవరప్పాడు గుండా వెళుతుంది. ఈ నాలుగు చోట్ల గంటల కొద్దీ ట్రాఫిక్ జామ్ అవుతోంది. ఈ నేపథ్యంలో విజయవాడకు తూర్పు, పశ్చిమలుగా రెండు బైపాస్‌లు నిర్మించాలని ప్రభుత్వం భావించింది. ఈ క్రమంలో పశ్చిమ బైపాస్ నిర్మాణం ఒక కొలిక్కివచ్చింది. ఇక తూర్పు బైపాస్ పనులు జరగాల్సి ఉండగా కేంద్ర ప్రభుత్వం దాని అవసరం లేదని తేల్చింది.

కీలకమైన రహదారి..

రాజధాని అమరావతి అభివృద్ధిలో రహదారుల కనెక్టివిటీ, పోర్టుల అనుసంధానం అత్యంత కీలకం. ఈ నేపథ్యంలో విజయవాడ తూర్పు బైపాస్ ఎంతో కీలకమైనది. గుంటూరు, కృష్ణా జిల్లాల ప్రజలు, ప్రధానంగా తీర ప్రాంత ప్రజలను ఎయిర్‌పోర్టుకు అనుసంధానించడంలో ఇదే అత్యంత కీలకమైన రోడ్డుగా భావించారు. ఓఆర్ఆర్ అందుబాటులోకి వచ్చే వరకూ బందరు సీ పోర్టు నుంచి ఎయిర్‌పోర్టును అనుసంధానం చేయడంలో కూడా ఈ రహదారి కీలకమైనది. ఉమ్మడి గుంటూరు, ప్రకాశం జిల్లాలతో పాటు, తూర్పు రాయలసీమ ప్రాంతాల్లోని ప్రజలకు ట్రాఫిక్ లేని రవాణాను అందుబాటులోకి తేవడంలో ఈ బైపాస్ కీలకమైనది. ఈ పరిస్థితుల్లో కిందటేడాది సెప్టెంబరు నెలాఖరున కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ఆమోదముద్ర వేశారు. ఎన్టీఆర్ జిల్లా పొట్టిపాడు టోల్ ప్లాజా నుంచి గుంటూరు జిల్లా చినకాకాని వరకు రూ.50 కి.మీ మేర ఈ రహదారిని నిర్మించేందుకు ఆమోదం తెలిపి రూ.2,176 కోట్లు కేటాయించారు.

అలైన్‌మెంటు మార్చితే పోయేదానికి..

ఓఆర్ఆర్, ఈస్ట్ బైపాస్‌ల నిర్మాణం ఒకదానికి ఒకటి దగ్గరగా ఉంటున్నాయన్న కారణం చూపి కేంద్రం ఈస్ట్ బైపాస్‌ను రద్దు చేసింది. వాస్తవానికి ఈస్ట్ బైపాస్ నిర్మాణానికి ఎన్‌హెచ్ఏఐ 3 అలైన్‌మెంట్లను సూచించింది. ఆప్షన్ 1 కింద విజయవాడకు సమీపంగా 41.230 కి.మీ, ఆప్షన్ 2 కింద మరికొంచెం దూరంలో 44.185 కి.మీ, ఆప్షన్- 3 కింద విజయవాడకు దూరంగా 45.595 కి.మీ పొడవున బైపాస్ నిర్మించుకునే అవ కాశం ఉంది. అయితే ఇందులో మూడో ఆప్షన్‌ను ఎన్ హెచ్ఏఐ ఓకే చేసింది. ఆ రోడ్డు ఇప్పుడు ఓ ఆర్ఆర్‌కు సమీపంలో వస్తోందని, అందుకే ఆ రోడ్డు అవ సరం ఉండదని చెప్పి కేంద్రం బైపాస్‌ను రద్దు చేసింది. రెండు రోడ్లు పక్క పక్కనే వచ్చే అవకాశం ఉన్న ప్పుడు ఆప్షన్ మార్చి తొలి రెండు ఆప్షన్లలో ఏదో ఒక ఆప్షన్ ను ఎంచుకుంటే బాగుండేదని ప్రజలు భావిస్తున్నారు. ఆ దిశ గా రాష్ట్ర ప్రభుత్వం ప్రయ త్నించాలని కోరుకుంటున్నారు.



ఈస్ట్ బైపాస్ నమూనా ప్రతిపాదనలు

ట్రాఫిక్ కష్టాలు..

రాజధాని నిర్మాణ నేపథ్యంలో ప్రభుత్వ కార్యాలయాలు, ప్రైవేటు సంస్థల రాక, కార్యకలాపాలు విపరీతంగా పెరిగిపోయాయి. దీంతో విజయవాడలో ట్రాఫిక్ విపరీతంగా పెరిగింది. సాధారణ రవా ణాతోపాటు విజయవాడ ఆటోనగర్ రవాణా, బందరు పోర్టు రవాణా కు నాలుగు చోట్ల అవకాశం కల్పించారు. దీంతో మహానాడు జంక్షన్, రింగురోడ్డు జంక్షన్, రామవరప్పాడు గ్రామాల్లో ట్రాఫిక్ గంటల కొద్దీ ఆగి పోతోంది. దీంతో ఎయిర్‌పోర్టు చెకిన్ వద్ద ప్రయాణికులు ఇబ్బందులు పడు తున్నారు. విజయవాడ వెస్ట్ బైపాస్ నుంచి ఎయిర్‌పోర్టుకు వెళ్లాలంటే పొట్టి పాడు టోల్‌గేటు వరకు వెళ్లి, అక్కడి నుంచి తిరిగి వెనక్కి రావాల్సి ఉంటుంది. అలా చేస్తే కనీసం 10 నుంచి 15 కి.మీ మేర అదనంగా ప్రయాణించాల్సి ఉంటుంది. అదే ఈస్ట్ బైపాస్ అయితే నేరుగా ఎయిర్‌పోర్టుకు కనెక్టివిటీ ఉంటుంది. ఈస్ట్ బైపాస్ రద్దు వల్ల రాజధాని అమరావతి సహా, గుంటూరు, తెనాలి, మంగళగిరి, రేపల్లె, దుగ్గిరాల, పొన్నూరు, చిలకలూరిపేట, మార్టూరు తదితర ప్రాంతాల ప్రజలతోపాటు కృష్ణా జిల్లాలోని బందరు, అవనిగడ్డ, పామర్రు, గుడివాడ ప్రజలు ఎయిర్‌పోర్టుకు వెళ్లాలంటే ఇబ్బందులు పడక తప్పదు.



బాపట్ల కేంద్రంగా డ్రగ్స్ దందా
విద్యార్థులే టార్గెట్‌గా సాగుతున్న విక్రయాలు

మత్తు..చిత్తు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

గంజాయి.. డ్రగ్స్.. మత్తు బిళ్లల దందా బాపట్ల కేంద్రంగా సాగుతోంది. గత వైసీపీ హయాంలో గంజాయి విక్రయాలు జరిగాయి. అయితే ప్రభుత్వం మారి గంజాయిపై కఠినంగా ఉంటున్నా జిల్లాలో మాత్రం ఇంకా ఆ ఆనవాళ్లు దర్శనమిస్తూనే ఉన్నాయి. గత వైసీపీ ప్రభుత్వం తాలూకా నిర్లిప్తత ఇంకా అధికారులను వీడకపోవడంతో గంజాయి, డ్రగ్స్ దందా యథేచ్ఛగా సాగుతోంది. ఇటీవల టాబ్లెట్ల విక్రయాలు, బహిరంగంగా మత్తు ఇంజక్షన్ల ఘటనలు చూసి జిల్లావాసులు షాక్‌కు గురయ్యారు. ఇటీవల బాపట్ల రూరల్ పరిధిలో డ్రగ్స్ అవశేషాలు కలిగి ఉన్న 1600 టాబ్లెట్లు ఓ సాధారణ మహిళ దగ్గర లభ్యమవడం మరింత కలవరపెడుతోంది. ఈ టాబ్లెట్లు పట్టుబడిన ప్రాంతానికి సమీపంలోనే ఓ ప్రముఖ కళాశాల ఉండడంతో విద్యార్థులు టార్గెట్‌గా సాగుతున్న మత్తు పదార్థాల అమ్మకాన్ని కట్టడి చేసే విషయంలో వ్యవస్థల వైఫల్యం పక్కాగా కనబడుతోంది. ఇది కూడా ఎక్సైజ్ సిబ్బంది నాటుసారా తనిఖీలకు వెళ్లగా యాదృచ్ఛికంగా జరిపిన సోదాల్లో టాబ్లెట్లు వెలుగుచూశాయి. దందా వ్యవస్థీకృతంగా నడిస్తే తప్ప మత్తు అవశేషాలు కలిగిన టాబ్లెట్ల విక్రయాలు జరగవనేది అందరికీ తెలిసిందే. వీటి తయారీ ఎక్కడ జరుగుతుంది అనే అంశంతో పాటు ఏ ప్రాంతం నుంచి వాటి సరఫరా జరుగుతుంది, గతంలో పట్టుబడిన గంజాయి నిందితుల పాత్ర ఏమన్నా ఈ రాకెట్‌లో ఉందా అనేకోణంలో కూడా విచారణ చేపట్టాల్సి ఉంది.

పోలీసుల అదుపులో ముగ్గురు యువకులు

బాపట్లలోని జమ్ములపాలెం ఆర్‌వోబీ మెట్లపై మత్తు ఇంజక్షన్లు చేసుకుంటున్న ముగ్గుర్ని యువకులను అదుపులోకి తీసుకొని విచారించినట్లు సీఐ ఆర్.రాంబాబు తెలిపారు. రైలుపేటకు చెందిన కీర్తి వంశీ, భీమావారిపాలేనికి చెందిన షేక్.రియాజ్, ఇస్లాంపేటకు చెందిన ఓ బాలుడు మెడికల్ షాపులలో పెయిన్ కిల్లర్స్ టాబ్లెట్స్ తీసుకుని వాటిని పొడిగా చేసి నీళ్లల్లో కలిపి ఇన్సులిన్ చేసుకున్నట్లు చేసుకుని మత్తులోకి వెళుతున్నట్లు గుర్తించామన్నారు. దీంతో వీరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు

తీవ్రత తెలిసినా.....అదే నిర్లక్ష్యం...

విద్యార్థులు టార్గెట్‌గా కళాశాలలను అడ్డాగా చేసుకుని మత్తు పదార్థాలు అమ్ముతున్న ఉదంతాలు గతంలోనూ వెలుగు చూశాయి. ఈ దఫా ఏకంగా అది టాబ్లెట్ల వరకు విస్తరించింది. అయినా క్షేత్రస్థాయిలోని సిబ్బంది విచారణలో వేగం చూపించడం లేదు. డ్రగ్స్ అవశేషాలు ఉన్న మాత్రలు దొరికి ఇప్పటికీ నాలుగు రోజులు అవుతున్నా విచారణ విషయంలో ఒక్క అడుగు ముందుకు పడలేదని సమాచారం. పట్టుబడిన మాత్రలను ల్యాబ్ పరీక్షలకు పంపడం విషయంలో కూడా ఇంకా ఓ నిర్ధరణకు రాలేదనేది సమాచారం. ఇక ఈ విషయం అటుంచితే బాపట్లలోని జమ్ములపాలెం ఆర్‌వోబీ మెట్లపై బహిరంగంగా ముగ్గురు యువకులు మత్తు ఇంజక్షన్లు చేసుకుంటున్న ఘటన కూడా ఎవరో ఫోన్‌లో వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేసే వరకు పోలీసులకు తెలియకపోవడం విశేషం.

ఒకరిమీద ఒకరు నెపంతో...

టాబ్లెట్లతో ఉన్న నిందితురాలిని పట్టుకుంది ఎక్సైజ్ సిబ్బంది కాగా, విషయం డ్రగ్స్ విభాగానిది కావడంతో విచారణను అక్కడకు పురమాయించారు. కానీ తాము పట్టుకున్నాం, డ్రగ్ విభాగానికి అప్పగించామని ఎక్సైజ్ విభాగం చేతులు దులుపుకోగా, విచారణలో నిందితురాలు కానీ, ఆ ప్రాంతవాసులు సహకరించడం లేదని డ్రగ్స్ విభాగం అధికారులు చెబుతున్నారు. కేసులు నమోదు చేయడమే తమ ఘనత అన్నట్లుగా వ్యవస్థలు ఉంటున్నాయే తప్పితే మూలాలు ఛేదించి మళ్లీ పునరావృతం కాకుండా చూద్దామన్న చిత్తశుద్ధి కొరవడుతోంది. కీలకమైన కేసుల విషయంలో మానిటరింగ్ చేయాల్సిన ఉన్నతాధికారులు కూడా పట్టించుకోకపోవడంతో కిందిసాయి యంత్రాంగం తమకు తోచినప్పుడు తూతూమంత్రంగా విచారణ చేసి మమ అనిపిస్తున్నారు తప్పితే గంజాయి అమ్మకాలను కట్టడి చేయడానికి అనుసరించాల్సిన వ్యూహాలే కరువయ్యాయి. మొక్కుబడిగా కళాశాలల్లో అవగాహన సదస్సులు పెట్టి మమ అనిపించడం తప్పితే నిఘా వ్యవస్థలు కూడా పనితీరు కూడా ఆశాజనకంగా ఉండడం లేదు.

జలజీవన్ మిషన్‌కు రూ.149 కోట్లు

- మంజూరైన పనులకు టెండర్లు పిలవాలి
- అధికారులకు కలెక్టర్ వెంకటమురళి ఆదేశం


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ జె.వెంకటమురళి

బాపట్ల, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): జలజీవన్ మిషన్ కింద జిల్లాకు రూ.149 కోట్లు మంజూరైనట్లు కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. డిస్ట్రిక్ వాటర్ శానిటేషన్ మిషన్ జిల్లా స్థాయి కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో 337 పనులకు నిధులు మంజూరయ్యాయన్నారు. జలజీవన్‌మిషన్ కింద మంజూరు చేసిన పనులకు టెండర్లు పిలవాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు తాగు నీటి ఇబ్బందులు రాకుండా సమ్మర్ యాక్షన్ ప్లాన్ తయారు చేయాలన్నారు. జిల్లాలోని సమగ్రనీటి సరఫరా పథకాలు, తాగునీటి బోర్ల మరమ్మత్తులకి అవసరమైన ప్రణాళికలు తయారు చేయాలని సూచించారు. జిల్లాలోని తాగునీటి పథకాల మరమ్మత్తులకి 15వ ఆర్థిక సంఘ నిధులపై సమగ్ర నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాలలో టాయిలెట్ల మరమ్మత్తులకి ప్రతిపాదనలు తయారు చేయాలన్నారు. మురుగు నీటి కాల్వల నిర్మాణాలకు పంచాయతీకి రూ.50 లక్షలు నిధులు మంజూరు చేసేవిధంగా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. సముద్రతీరంలో ఆరు బీచ్‌ల వద్ద 10 బయో టాయిలెట్స్‌ను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా గ్రామీణ నీటిసరఫరాశాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ అనంత రాజు, డీపీవో ప్రభాకర్, డ్వామా పీడీ విజయలక్ష్మి, స్త్రీశిశు సంక్షేమశాఖ పీడీ రాదామాధవి, జిల్లా వ్యవసాయాధికారి రామకృష్ణ, గుంటూరు, ప్రకాశం జడ్పీ డిప్యూటీ సీఈవోలు కృష్ణ, బాలమ్మ పాల్గొన్నారు.

రంజాన్ వేళలు
ఇఫ్తార్ : 6.24 (గురువారం సాయంత్రం)
సహరి : 4.55 (శుక్రవారం ఉదయం)

వైసీపీకి మర్రి షాక్



- ఎమ్మెల్సీ పదవికి రాజీనామా
- రెండు రోజుల్లో పార్టీకి రాజశేఖర్ గుడ్‌బై
- అనుయాయులతో కలిసి త్వరలో టీడీపీలో చేరిక
- వరుస పరాభవాలు.. జగన్‌పై ఆగ్రహంతో నిర్ణయం

గుంటూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ఆవిర్భావం నుంచి పార్టీకి వెన్నుదన్నుగా ఉండటమే కాకుండా ఉమ్మడి గుంటూరు జిల్లాలో తొలుత రథ సారధ్యం వహించిన మర్రి రాజశేఖర్ వైసీపీకి షాకిచ్చారు. ఎంతోకాలం నుంచి అందరూ ఊహించినట్లుగానే మాజీ ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ వైసీపీని వీడేందుకు సిద్ధమయ్యారు. ఇందులో భాగంగా ఆయన తొలుత వైసీపీ ద్వారా తాను పొందిన ఎమ్మెల్సీ పదవిని వదిలేసుకున్నారు. ఈ మేరకు రాజీ నామా పత్రాన్ని బుధవారం శాసనమండలి చైర్మన్‌కు అందజేశారు. చిలకలూరిపేటలో కాంగ్రెస్‌లో రాజకీయ ప్రస్థానం ప్రారంభించి అనంతరం వైసీపీ ఆవిర్భావంతో ఆ పార్టీలో చేరారు. అయితే విడదల రజిని రాజకీయ అరంగేట్రంతో నియోజకవర్గంలో మర్రి రాజశేఖర్ ప్రాధాన్యం తగ్గిపోయింది. 2019 ఎన్నికల్లో ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్న రాజశేఖర్‌ను కాదని వైసీపీలో కొత్తగా చేరిన విడదల రజినికి సీటు ఇవ్వడంతో మర్రి అనుయాయులు తిరుగుబాటు చేశారు. ఆ సమయంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా చిలకలూరిపేట వెళ్లిన వైఎస్ జగన్ రజినిని గెలిపిస్తే రాజశేఖర్‌కు ఎమ్మెల్సీ ఇచ్చి మంత్రిని చేస్తానని హామీ ఇచ్చారు. ఎన్నికల తర్వాత కనీసం ఎమ్మెల్సీ పదవి కూడా వెంటనే ఇవ్వకుండా రజినికి మంత్రి పదవిని కట్టబెట్టారు. ఈ క్రమంలో వరుస పరాభవాలతో రగిలిపోతున్న ఆయన కొద్దికాలంగా పార్టీకి దూరంగా ఉంటున్న విషయం తెలిసిందే. ఈ పరిస్థితుల్లో గుంటూరు పశ్చిమలో ఓడిపోయిన మాజీ మంత్రి విడదల రజినిని తిరిగి చిలకలూరిపేటకు ఇన్‌చార్జిగా నియమించారు. దీంతో ఆయన ఉక్రోషంతో రగిలి పోయారు. ఆ సమయంలోనే ఆయన వైసీపీని వీడతారని కథనాలు వెలువడ్డాయి. అంతకు మునుపు జగన్ రాజశేఖర్‌ను పిలిపించుకుని చిలకలూరిపేట ఇన్‌చార్జి బాధ్యతలు ఇస్తానని హామీ ఇవ్వడమే కాకుండా వచ్చే ఎన్నికల్లో సతీమణికి సీటు ఇస్తానని ఆశ పెట్టారని సమాచారం. ఇది జరిగిన కొద్ది రోజులకే రజిని చక్రం తిప్పడం ఆ తర్వాత వారం రోజులు గడవక ముందే మర్రికి ఇచ్చిన హామీని జగన్ తుంగలో తొక్కి చిలకలూరిపేట ఇన్‌చార్జి బాధ్యతలు రజినికి కట్టబెట్టటంతో మర్రి అవాక్కయ్యారు. ఇక ఆ రోజు నుంచే ఆయన టీడీపీలో చేరాలని నిర్ణయించుకున్నారు. 2023లో ఆయనకు ఎమ్మెల్సీ ఇవ్వగా 2029 వరకు ఆ పదవిలో కొనసాగే అవకాశం ఉన్నా కూడా పదవికి రాజీనామా చేయడం విశేషం. గత ఎన్నికల సమయంలో వైసీపీని వీడి టీడీపీలో చేరి తిరిగి ఎంపీగా గెలుపొందిన లావు శ్రీకృష్ణదేవరాయులతో రాజశేఖర్‌కు సన్నిహిత సంబంధాలున్నాయి. కాగా త్వరలో మంచి ముహూర్తం చూసుకుని తన అనుయాయులతో వైసీపీకి గుడ్ బై చెప్పి టీడీపీలో చేరేందుకు ఆయన సన్నద్ధమవుతున్నారు.

మండల పరిషత్ అధ్యక్షుల ఎన్నిక 27న

- ఉమ్మడి గుంటూరు జిల్లాలో మూడు స్థానాల్లో ఖాళీలు
- అదే రోజున ఉపాధ్యక్ష, కో-ఆప్షన్ సభ్యుల ఎంపిక

గుంటూరు సిటీ, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ ల్లో ఎన్నికల నగారా మోగింది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఖాళీ గా ఉన్న మండల పరిషత్ అధ్యక్ష, ఉపాధ్యక్ష, కో-ఆప్షన్ సభ్యుల ను ఎన్నుకునేందుకు ఎన్నికల కమిషన్ బుధవారం అనుమతి ఇచ్చింది. తొలుత ఆయా పదవులు ఖాళీగా ఉన్న మండలాలకు కలెక్టర్ ప్రత్యేక అధికారులను నియమిస్తారు. నియమించబడిన ప్రత్యేక అధికారులు ఈ నెల 23 నాటికి మండల పరిషత్‌లోని సభ్యులకు నోటీసులు అందజేస్తారు. 27న నిర్వహించే ప్రత్యేక సాధారణ సమావేశంలో ఎంపీపీ, ఉప ఎంపీపీ, కో-ఆప్షన్ సభ్యుల ను ఎన్నుకుంటారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని అచ్చంపేట, పిట్టలవానిపాలెం, దుగ్గిరాల మండల పరిషత్‌ల్లో అధ్యక్ష స్థానాలు ఖాళీగా ఉన్నాయి. నరసరావుపేట, గుంటూరు రూరల్, కారంపూడి మండలాల్లో ఉపాధ్యక్ష స్థానాలు ఖాళీగా ఉన్నాయి. భట్టిప్రోలు, తెనాలి, ముప్పాళ్ల మండల పరిషత్‌ల్లో కో-ఆప్షన్ సభ్యుల స్థానాలు ఖాళీగా ఉన్నాయి. ఆయా స్థానాల్లో ఎన్నికల కార్యక్రమం నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.







చిత్రజ్యోతి
SINCE 1965

నాన్నకు ప్రేమతో..


'దక్ష'లో మోహన్‌బాబు



ప్రస్తుతం మంచు కుటుంబంలో యుద్ధవాతావరణం నెలకొని ఉంది. ముఖ్యంగా తండ్రీకొడుకులు మోహన్‌బాబు, మనోజ్ మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమని మండే పరిస్థితి. ఒకరిపై ఒకరు కేసులు పెట్టుకున్నారు. తను సంపాదించిన ఆస్తులు, కట్టుకున్న ఇల్లు మనోజ్ ఆక్రమించాడని మోహన్‌బాబు స్వయంగా రంగారెడ్డి కలెక్టర్ ఆఫీసుకు వెళ్లి ఫిర్యాదు చేశారు. పోలీసుల సాయంతో మనోజ్‌ను హైదరాబాద్ జల్‌పల్లిలో ఉన్న తన ఇంటి నుంచి వెళ్లగొట్టారు మోహన్‌బాబు. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో మోహన్‌బాబు పుట్టిన రోజు వేడుకలు బుధవారం జరిగాయి. తండ్రి పుట్టినరోజు సందర్భంగా మనోజ్ సోషల్ మీడియాలో ఓ పోస్టు పెట్టారు. 'హ్యాపీ బర్త్‌డే నాన్నా.. మనమంతా కలసి వేడుకలు చేసుకునే ఈ రోజు మీ పక్కనే ఉండే అవకాశాన్ని కోల్పోయా. మీతో కలసి ఉండే క్షణాల కోసం ఎదురు చూస్తున్నా.. లవ్ యూ' అని ఆ పోస్ట్‌లో పేర్కొన్నారు. మనోజ్ పెట్టిన ఈ పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. మరి దీనిపై మోహన్‌బాబు ఎలా స్పందిస్తారో వేచి చూడాలి.

విశ్వామిత్రకు పుట్టినరోజు శుభాకాంక్షలు

తన తండ్రి మోహన్‌బాబు పుట్టినరోజు సందర్భంగా నటి మంచు లక్ష్మీప్రసన్న ఎక్స్ వేదికగా శుభాకాంక్షలు తెలిపారు. ఆయన ముఖ్య పాత్రధారిగా తను నిర్మిస్తున్న 'దక్ష' చిత్రంలోని లుక్‌ను షేర్ చేసి "మా ప్రొఫెసర్, డాక్టర్. విశ్వామిత్రకు పుట్టినరోజు శుభాకాంక్షలు" అని పేర్కొన్నారు. 'కన్నప్ప' సినిమాలో మోహన్‌బాబు మహాదేవ శాస్త్రిగా కనిపించనున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలోని 'ఓం నమః శివాయ' అనే పాటలో ఆయన పాత్రకు సంబంధించిన వీడియో గ్లింప్స్‌ను విడుదల చేసి శుభాకాంక్షలు తెలిపారు మేకర్స్.

కడుపుబ్బా నవ్వించే చిత్రం


సప్తగిరి

సప్తగిరి కథానాయకుడిగా నటించిన చిత్రం 'పెళ్లికాని ప్రసాద్'. అభిలాష్‌రెడ్డి గోపిడి దర్శకత్వంలో కె.వై.బాబు, భానుప్రకాష్ గౌడ్, సుక్కా వెంకటేశ్వర్ గౌడ్, వైభవ్‌రెడ్డి ముత్యాల నిర్మించారు. దిల్‌రాజు నిర్మాణ సంస్థ శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్ సినిమాను విడుదల చేస్తోంది. ఈ శుక్రవారం సినిమా విడుదలవుతున్న సందర్భంగా మీడియాతో ముచ్చటించారు సప్తగిరి. "దర్శకుడు అభిలాష్ ఈ కథ చెప్పేటప్పుడే సినిమా విజయంపై పూర్తి నమ్మకం వచ్చేసింది. అందరినీ కడుపుబ్బా నవ్వించే చిత్రమిది. ఎక్కడా బోర్ కొట్టదు. దర్శకుడు అభిలాష్ రాసిన సంభాషణలు, వినోదాత్మక సన్నివేశాలు, శేఖర్ చంద్ర అందించిన సంగీతం ఈ సినిమాకు ప్రధానాకర్షణ. సినిమా అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది" అని చెప్పారు.

అద్భుతమైన అనుభూతినిచ్చేలా...



హర్ష రోషన్, కార్తికేయ దేవ్, స్టీవెన్ మధు, నిహాల్ కోదాటి, సాన్వీ మేఘన ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'టుక్ టుక్'. సుప్రీత్ కృష్ణ దర్శకత్వంలో రాహుల్ రెడ్డి, లోక్కు శ్రీ వరుణ్, శ్రీరాముల రెడ్డి నిర్మించారు. ఈ శుక్రవారం సినిమా విడుదలవుతోన్న సందర్భంగా ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించారు. కార్యక్రమంలో దర్శకుడు సుప్రీత్ మాట్లాడుతూ "ప్రేక్షకులకు అద్భుతమైన అనుభూతినిచ్చేలా సరికొత్తగా ఉంటుందీ సినిమా. అందరి మనసులు గెలుచుకుంటుంది" అని అన్నారు. "సినిమా తప్పక విజయం సాధిస్తుంది" అని నిర్మాత రాహుల్ రెడ్డి చెప్పారు.

బ్యాక్ టు హైదరాబాద్



మహేశ్‌బాబు హీరోగా రాజమౌళి దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న భారీ చిత్రం రెండో షెడ్యూల్ పూర్తయింది. ప్రియాంక చోప్రా హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రాన్ని డాక్టర్ కె.ఎల్.నారాయణ నిర్మిస్తున్నారు. పదిహేను రోజులుగా ఒడిశాలోని కోరాపుట్ జిల్లాలో ఈ సినిమా షూటింగ్ జరిగింది. సిమిలిగుడ సమీపంలోని మాలి, పుట్‌సేల్, బాల్డ ప్రాంతాల్లో కీలక సన్నివేశాలు చిత్రీకరించారు. మంగళవారం రాత్రితో షెడ్యూల్ పూర్తి కావడంతో చిత్ర యూనిట్ హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణమైంది. యాక్షన్ అడ్వెంచర్ కథాంశంతో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు రాజమౌళి.

అందమైన ప్రేమకథ



వినయ్‌కుమార్, శ్రావణి మజ్జరి, అరవింద్ ముదిగొండ, నోమిన తార ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'కాలమేగా కరిగింది'. సింగార మోహన్ దర్శకత్వంలో మరే శివశంకర్ నిర్మించారు. ప్రపంచ కవితా దినోత్సవం సందర్భంగా ఈ శుక్రవారం విడుదలవుతోందీ చిత్రం. తాజాగా, నిర్వహించిన ప్రీ రిలీజ్ వేడుకలో హీరో వినయ్‌కుమార్ మాట్లాడుతూ "కలహాలే లేని అందమైన ప్రేమకథ ఇది" అని అన్నారు. "ఈ కవితాత్మక చిత్రం అందరినీ ఆకట్టుకుంటుంది. మంచి విజయం సాధిస్తుంది" అని దర్శకుడు శింగార మోహన్ చెప్పారు. "ఇదో స్వచ్ఛమైన ప్రేమకథ. సినిమా అద్భుతంగా ఉంటుంది" అని నిర్మాత మరే శివశంకర్ తెలిపారు.

మహిళల సమస్యలపై..



షెరాజ్ మెహదీ కథానాయకుడిగా స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ఓ అందాల రాక్షసి'. విహాన్షీ హెగ్డే, కృతి వర్మ కథానాయికలు. సురీందర్ కౌర్ నిర్మించారు. ఈ శుక్రవారం సినిమా విడుదలవుతోన్న సందర్భంగా చిత్రబృందం ప్రీరిలీజ్ వేడుక నిర్వహించారు. హీరో షెరాజ్ మెహదీ మాట్లాడుతూ "ఇది చిన్న చిత్రమైనా.. పెద్ద విజయం సాధిస్తుంది. అన్ని వర్గాల ప్రేక్షకుల ఆదరణ పొందుతుంది" అని చెప్పారు. హీరోయిన్ కృతి వర్మ మాట్లాడుతూ "ఈ సినిమా కథ వినగానే గూస్‌బంప్స్ వచ్చాయి" అని చెప్పారు. హీరోయిన్ విహాన్షీ హెగ్డే మాట్లాడుతూ "మహిళల సమస్యలపై తీసిన చిత్రమిది" అని తెలిపారు.





ఎన్టీఆర్ వైద్యసేవలోని లోపాలపై దృష్టి సారించండి : ప్రత్తిపాటి


అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి

చిలకలూరిపేట, మార్చి19 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ వైద్యసేవ ద్వారా నాణ్యమైన వైద్యసేవలు అందిస్తున్నా ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా సాయం కోరేవారి సంఖ్య పెరగడంపై ప్రభుత్వం ఆలోచించాలని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు బుధవారం సూచించారు. అసెంబ్లీలో రాష్ట్ర వైద్యరంగంపై జరిగిన చర్చలో పుల్లారావు మాట్లాడుతూ ఎన్టీఆర్ వైద్యసేవలోని విధాన లోపాలు, క్షేత్రస్థాయిలో రోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించాలన్నారు. గుండె, కిడ్నీ ఇతర ప్రధాన అవయవాల శస్త్రచికిత్సలు, క్యాన్సర్ చికిత్సలకు కొన్ని ఆసుపత్రులు అదనంగా డబ్బు వసూలు చేస్తున్నారనే ఫిర్యాదులపై ప్రభుత్వం దృష్టి పెట్టాలన్నారు. చిలకలూరిపేటలో వందపడకల ఆసుపత్రిని పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని ప్రభుత్వాని కోరారు.

పశుసంవర్ధక శాఖలో భారీ కుంభకోణం

వెటర్నరీ మొబైల్ క్లినిక్‌ల కొనుగోళ్లలో అవినీతి

అసెంబ్లీలో ఎమ్మెల్యే ధూళిపాళ్ల ధ్వజం


అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నరేంద్ర

పొన్నూరుటౌన్, గుంటూరు సిటీ, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ ఆర్కేవీవై స్కీమ్‌లో భాగంగా కొనుగోలు చేసిన వెటర్నరీ మొబైల్ కొనుగోళ్ల క్లినిక్స్‌లో జరిగిన భారీ అవినీతిపై విచారణ జరపాలని ఎమ్మెల్యే, సంగం డెయిరీ ఛైర్మన్ ధూళిపాళ్ల నరేంద్రకుమార్ బుధవారం శాసనసభ ద్వారా ప్రభుత్వాన్ని కోరారు. వైసీపీ ప్రభుత్వం హయాంలో మొబైల్ అంబులెన్స్‌ల కొనుగోళ్లలో ప్రిన్సిపల్ సెక్రటరీ స్థాయి అధికారుల కుమ్మక్కుతోనే నాటి ప్రభుత్వ పెద్దలు భారీ దోపిడీకి తెర లేపారని ఆరోపించారు. వాహన కొనుగోళ్ల ధరలను పక్క రాష్ట్రాలతో పోలిస్తే ఆంధ్రప్రదేశ్‌లో భారీ వ్యత్యాసం ఉందన్నారు. ఫేజ్-1లో 175 వాహనాలు రూ. 145 కోట్లతో, ఫేజ్-2లో 165 వాహనాలు రూ. 110 కోట్లతో కొనుగోలు చేశారని చెప్పారు. మొదటి దశలో వాహనం, ఆపరేటింగ్ సిస్టం కలిపి ఒక్కో క్లినిక్‌ను రూ. 82 లక్షలకు కొనుగోలు చేస్తే రెండవ దశలో రూ. 68 లక్షలు చెల్లించారన్నారు. ఈ రెండు దశల మధ్య ఒక్కో క్లినిక్ ఏర్పాటుకు రూ. 14లక్షల వ్యత్యాసం ఉందన్నారు.

సీఆర్‌డీఏకి భారీగా ఇసుక డిమాండ్

● కోటి 98 లక్షల 35 వేల 670 క్యూబిక్ మీటర్లకు ఇండెంట్ ● ఎల్‌పీఎస్ ఇన్‌ఫ్రా, హెచ్ అండ్ బీ, ఏడీసీఎల్ నుంచి విజ్ఞప్తులు

గుంటూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధాని నగరంలో ఇప్పటికే కొన్ని పెండింగ్ పనుల నిర్మాణం ప్రారంభం కావడం... మరికొద్ది రోజుల్లో రూ.వేల కోట్ల వర్కులు కూడా మొదలు కానుండటంతో సీఆర్‌డీఏకి భారీగా ఇసుక అవసరం ఏర్పడింది. అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్, ల్యాండ్ పూలింగ్ స్కీమ్ లేఅవుట్లలో మౌలిక సదుపాయాల కల్పన, ఇళ్లు, భవనాల నిర్మాణాలకు ఇసుక అవసరమని సీఆర్‌డీఏకి ఇటీవలే ఇండెంట్లు అందాయి. దాంతో ఆ సంస్థ గుంటూరు జిల్లా గనులు, భూగర్భ శాఖకు ఇసుక డిమాండ్ వివరాలను తెలియజేయగా ఆ మేరకు సరఫరా చేసేందుకు అధికార యంత్రాంగం ప్రణాళిక రూపొందిస్తున్నది. కేవలం మూడు నెలల వ్యవధిలో 51 లక్షల క్యూబిక్ మీటర్ల ఇసుక అవసరం ఉండటంతో కృష్ణానదిలో పలుచోట్ల పూడిక తొలగింపు, తవ్వకాల ద్వారా సరఫరా చేసేందుకు ప్రణాళికని సిద్ధం చేస్తున్నది. ఏపీసీఆర్‌డీఏ కమిషనర్ కన్నబాబు నుంచి ఇటీవలే గుంటూరు జిల్లా మైనింగ్ డిపార్టుమెంట్‌కు కేటగిరీల వారీగా ఇసుక డిమాండ్ విజ్ఞప్తి అందింది. ఎల్‌పీఎస్ ఇన్‌ఫ్రాకు కోటి 18 లక్షల 69 వేల 500 క్యూబిక్ మీటర్లు, హెచ్ అండ్ బీకి 11 లక్షల 77 వేల 815, ఏడీసీఎల్‌కి 67 లక్షల 88 వేల 355 క్యూబిక్ మీటర్ల ఇసుక అవసరమని నివేదించారు. ఇందులో ఏప్రిల్, మే, జూన్ నెలల్లో ప్రతీ 15 రోజులకు ఒకసారి ఇసుక సరఫరా చేయాలని కోరారు. మొదటి నెలలో 8.65 లక్షలు క్యూబిక్ మీటర్ల మేరకు రెండు సార్లు, రెండో నెలలో 8.49 లక్షల మేరకు రెండు సార్లు, మూడో నెలలో కూడా 8.49 లక్షల మేరకు రెండుసార్లు ఇసుక సరఫరా చేయాలన్నారు. ఇందుకు కారణం కేంద్ర ప్రభుత్వం ప్రపంచ బ్యాంకు, ఏడీబీ నుంచి అమరావతి రాజధాని నిర్మాణానికి అవసరమైన నిధులను సమకూరుస్తున్నది. అలానే హడ్కో నుంచి రూ.11 వేల కోట్ల రుణం లభించింది. అలానే జర్మనీకి చెందిన మరో బ్యాంకు నుంచి రూ.5 వేల కోట్ల రుణం మంజూరు కాబోతున్నది. రహదారుల నిర్మాణం, ఎల్‌పీఎస్ లేఅవుట్లలో మౌలిక సదుపాయాల కల్పన, రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ వంటి అనేక పనులను వివిధ సంస్థలు చేపట్టబోతున్నాయి. దీంతో ఇసుకకి భారీగా డిమాండ్ ఏర్పడింది. కాగా గుంటూరు జిల్లాలో ప్రస్తుతం గుండిమెడ-2 ఓపెన్ రీచ్‌లో 51 వేలు, బొమ్మువానిపాలెం-1లో 72 వేలు, బొమ్మువానిపాలెం-16 ఓపెన్ రీచ్‌లో 2.50 లక్షలు, బొమ్మువానిపాలెం-17 ఓపెన్ రీచ్‌లో లక్ష, రాయపూడిలో పూడిక తొలగింపు చేపట్టాల్సిన ప్రదేశంలో 1.19 లక్షలు, నేవిగేషన్ ఛానల్‌లో డ్రెడ్జింగ్ చేస్తే 5.16 లక్షలు, బోరుపాలెంలో 2.30 లక్షలు, బొమ్మువానిపాలెం-14లో 47 వేల, బొమ్మువానిపాలెం-15లో 55 వేల క్యూబిక్ మీటర్లు మొత్తం కలిపి 14.49 లక్షల క్యూబిక్ మీటర్ల ఇసుక నిల్వలు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. 54 లక్షల మెట్రిక్ టన్నుల వరకు ఇసుక డిమాండ్ ఉండటంతో దాదాపుగా 45 లక్షల టన్నుల ఇసుక లోటు ఉన్నది. ఈ నేపథ్యంలో జిల్లాలో మరికొన్ని ఇసుక మేటలు ఉన్న ప్రదేశాలను గుర్తిస్తామని, అయినప్పటికీ సీఆర్‌డీఏ అవసరం మేరకు సరఫరా చేయలేని పరిస్థితి ఉంటుందని గుంటూరు జిల్లా అధికారులు తెలిపారు. ఈ కారణంగా కృష్ణా, పల్నాడు, బాపట్ల, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలకు కూడా ఇండెంట్ పెట్టాల్సిందిగా సీఆర్‌డీఏకి సూచిస్తున్నారు.

మద్యం మత్తు బానిసలకు ప్రత్యేక కౌన్సెలింగ్ ఇవ్వండి

ఎక్సైజ్ శాఖ రాష్ట్ర కమిషనర్ నిశాంత్ కుమార్


డీ ఎడిక్షన్ సెంటర్‌ను పరిశీలిస్తున్న నిశాంత్ కుమార్ తదితరులు

గుంటూరు కార్పొరేషన్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తుకు బానిసైన వారికి ప్రత్యేక కౌన్సెలింగ్ ఇవ్వాలని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ కమిషనర్ నిశాంత్ కుమార్ తెలిపారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ రాహుల్ దేవ్ శర్మతో కలిసి బుధవారం ఆయన గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలోని డీ ఎడిక్షన్ సెంటర్‌ను, గుంటూరు ఎక్సైజ్ శాఖ కార్యాలయంలోని లేబరేటరీని పరిశీలించారు. ఈ సందర్భంగా నిశాంత్ కుమార్ మాట్లాడుతూ మత్తుమందుకు బానిస అయిన వారు మత్తుకు దూరంగా ఉండేలా చేయాలని, అందుకు కౌన్సెలింగ్ బాగా ఉపయోగపడుతుందన్నారు. క్రమం తప్పకుండా ప్రభుత్వ ఆసుపత్రిలో కౌన్సెలింగ్ ఇవ్వటంతో వారిలో క్రమక్రమంగా మార్పు కనిపిస్తుందన్నారు. ఈ విధంగా మార్పు రావడం వల్ల వారు మత్తుకు దూరంగా ఉంటారని అన్నారు. మద్యం మత్తులో పడితే వారి జీవితాలు ఇబ్బందులకు గురవుతాయని, మానసిక స్థితి సక్రమంగా ఉండదని, దీనివల్ల కుటుంబం చిన్నా బిన్నమవుతుందన్నారు. గుంటూరు ఎక్సైజ్ కార్యాలయంలోని లేబరేటరీని పరిశీలించి కొత్తగా ఏర్పాటు చేసిన మిషనరీ ఎలా పని చేస్తుందని అడిగి తెలుసుకున్నారు. కల్తీ మద్యంపై నిఘా ఉంచాలని, శాంపిల్స్‌లో ఏ మాత్రం అనుమానం ఉన్నా వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గుంటూరు ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ కే శ్రీనివాసులు, గుంటూరు ఎక్సైజ్ శాఖ అధికారి అరుణ కుమారి, ఏఈ ఎస్ మారయ్య బాబు, సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం బుధవారం నాటికి 518.90 అడుగులు ఉంది. ఇది 147.27 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 7033 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 7852 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 16,685 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

మేడికొండూరు వ్యవసాయ అధికారిపై వేటు

● యలవర్తిపాడు పంట నష్ట పరిహారం అక్రమాలపై చర్యలు
● పల్నాడుకు డిప్యుటేషన్‌పై పంపుతూ కమిషనర్ ఉత్తర్వులు

గుంటూరు సిటీ, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): పంట నష్ట పరిహారం చెల్లింపుల్లో జరిగిన అక్రమాలపై రాష్ట్ర వ్యవసాయ శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. మేడికొండూరు మండల వ్యవసాయ అధికారి ఎం నాగరాజుపై తాత్కాలిక బదిలీ వేటు వేశారు. మేడికొండూరు మండలం యలవర్తిపాడులో గత ఏడాది జరిగిన వరదల్లో పంట నష్టం భారీగా జరిగింది. పంట నష్ట పరిహారం కాజేసేందుకు వ్యవసాయ శాఖ అసిస్టెంట్, రెవెన్యూ సిబ్బంది ముందుగానే ప్రణాళికలు రచించారు. లేని రైతులను ఈ-పంటలో నమోదు చేసి నష్ట పరిహారం దారి మళ్లించారు. ఈ వ్యవహారం బయటకు రావడంతో అప్పట్లోనే అగ్రికల్చర్ అసిస్టెంట్, రెవెన్యూ సిబ్బందిపై చర్యలు చేపట్టారు. మండల ఏవో ఈ విషయంలో అప్రమత్తంగా లేరన్న ఆరోపణలు రావటంతో ఆయనపై చర్యలు తీసుకోవాలని కోరుతూ జిల్లా వ్యవసాయ అధికారి కమిషనర్‌కు సిఫార్సు చేశారు. ఈ నేపథ్యంలో ఏవో నాగరాజును పల్నాడు జిల్లా రైతు శిక్షణా కేంద్రానికి డిప్యూటేషన్‌పై పంపుతూ బుధవారం వ్యవసాయ శాఖ కమిషనర్ ఢిల్లీరావు ఉత్తర్వులు జారీ చేశారు. ఫిరంగిపురం ఏవో వాసంతికి మేడికొండూరు వ్యవసాయ అధికారిగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు.

'సాయి సాధన' కేసు గుంటూరుకి బదిలీ

నరసరావుపేట లీగల్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): చిట్‌ఫండ్ దారులను, డిపాజిట్ దారులను భారీస్థాయిలో మోసగించినట్లు వేలూరు సుబ్బారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు నమోదు చేసిన కేసు గుంటూరులోని ఆరవ అదనపు జూనియర్ సివిల్ న్యాయాధికారి కోర్టుకు బదిలీ అయింది. ఈ కేసును గుంటూరు ఆరవ అదనపు జూనియర్ సివిల్ న్యాయాధికారి కోర్టుకు బదిలీ చేయవలసిందిగా పోలీసులు పిటిషన్ దాఖలు చేశారు. ఈ మేరకు స్థానిక 13వ అదనపు జిల్లా న్యాయస్థానంలో పాలడుగు పుల్లారావు కుటుంబ సభ్యులు దాఖలు చేసుకున్న ముందస్తు బెయిల్ పిటిషన్ కూడా గుంటూరు జిల్లాప్రధాన న్యాయస్థానానికి బదిలీ అయింది. ఈ మేరకు బుధవారం నరసరావుపేట 13వ అదనపు జిల్లా న్యాయస్థానం ఏపీపీ మల్లారెడ్డి కోర్టులో రిప్రజెంటేషన్ చేశారు. ఈ కేసులో సంస్థతో పాటు మరో ఆరుగురిని పోలీసులు నిందితులుగా పేర్కొన్నారు. పాలడుగు పుల్లారావు, ఆయన భార్య వాణిశ్రీ ,కుమారుడు పవన్ కుమార్, కుమార్తె శ్రీహర్షవర్ధిని, అల్లుడు ప్రముఖ హృద్రోగ నిపుణులు డాక్టర్ నూకవరపు రాజా రమేష్, నకరికల్లు మండలం కండ్లకుంట గ్రామానికి చెందిన గాలికోటయ్యలు ఈ కేసులో నిందితులుగా ఉన్నారు.

మిర్చియార్డులో భోక్తలపై క్రిమినల్ చర్యలు

● అసెంబ్లీలో మంత్రి అచ్చెన్నాయుడు ప్రకటన

గుంటూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ(మిర్చియార్డు)లో జరిగిన అవినీతి, అక్రమాలపై బుధవారం శాసనసభలో చర్చ జరిగింది. గుంటూరు తూర్పు ఎమ్మెల్యే ఎండీ నసీర్‌అహ్మద్ వేసిన ప్రశ్నపై మార్కెటింగ్ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు సమాధానం ఇచ్చారు. విజిలెన్స్ నివేదిక ఆధారంగా బాధ్యులపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని మంత్రి ప్రకటన చేశారు. ఈ ప్రశ్నకు అనుబంధంగా నసీర్‌తో పాటు ఎమ్మెల్యేలు ధూళిపాళ్ల నరేంద్రకుమార్(పొన్నూరు), బూర్ల రామాంజనేయులు(ప్రత్తిపాడు) గళం విప్పారు. దాదాపుగా 20 నిమిషాలకు పైగా ఈ ఒక్క ప్రశ్న పైనే చర్చ జరగడం విశేషం. వైసీపీ ప్రభుత్వంలో మిర్చియార్డులో అనేక అక్రమాలు జరిగాయని, రూ.347.71 కోట్ల ఆదాయాన్ని కోల్పోయిందని విజిలెన్స్ నివేదిక ఇచ్చినట్లు మంత్రి చెప్పారు. ఒకరిద్దరు మాజీ చైర్మన్లు, 19 మంది అధికారులపై చర్యలకు విజిలెన్స్ సిఫార్సు చేసినట్లు తెలిపారు. యార్డులో అగ్ని ప్రమాదం సంభవించినప్పుడు వచ్చిన పరిహారంలోనూ గత కాంగ్రెస్‌లో పాలకులు(ప్రస్తుతం వైసీపీ) దోచుకున్నారని ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ వివరించారు. ఈనాం విధానాన్ని పక్కనపెట్టి రూ.160 కోట్లు రావాల్సిన మార్కెట్ సెస్‌ను రూ.80 కోట్లకు చూపించారని తెలిపారు. వైసీపీ వాళ్ల బంధువులు, మిత్రులకు 287 లైసెన్సులను అక్రమంగా కట్టబెట్టారని, ఇందులోనూ దోపిడీ జరిగిందని తెలిపారు. మిర్చియార్డుని సమూలంగా ప్రక్షాళన చేయాలని పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ కోరారు. టీడీపీ ఆఫీసుపై దాడికి మిర్చియార్డులో వైసీపీ నాయకులు వ్యూహరచన చేశారని ఆరోపించారు. మిర్చియార్డుని విభజన అయినా చేయాలని, లేకుంటే ప్రత్తిపాడుకు తరలించాలని ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు తెలిపారు.

గేట్‌లో భాష్యం పూర్వ విద్యార్థికి 25వ ర్యాంక్


గంటా హేమంత్

గుంటూరు (విద్య) మార్చి 19 (ఆంధ్రజ్యోతి): గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఇంజనీరింగ్ (గేట్) 2025 బుధవారం విడుదల చేసిన పరీక్షా ఫలితాలలో భాష్యం పూర్వ విద్యార్థి ఘంటా హేమంత్ జాతీయస్థాయిలో 25వ ర్యాంకును సాధించినట్లు భాష్యం విద్యాసంస్థల ఛైర్మన్ భాష్యం రామకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత నెలలో ఐఐటీ రూర్కీ ద్వారా గేట్ పరీక్ష నిర్వహించారు. డేటా సైన్స్ అండ్ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (డీఏ) విభాగంలో భాష్యం పూర్వ విద్యార్థి జాతీయస్థాయిలో ఆలిండియా 25వ ర్యాంకు సాధించినట్లు తెలిపారు. హేమంత్ స్కూల్ స్థాయి నుంచి భాష్యం విద్యా సంస్థల్లో చదువుకుని భాష్యం ఐఐటీ జేఈఈ అకాడమీ ద్వారా 2021లో ఐఐటీ మద్రాస్‌లో సీటు సాధించినట్లు గుర్తు చేశారు. హేమంత్‌ను, వారి తల్లిదండ్రులను ఛైర్మన్ రామకృష్ణ, వైస్ ఛైర్మన్ హనుమంతరావు, మేనేజింగ్ డైరెక్టర్ సాకేత్ రామ్‌లు అభినందించారు.

విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

● ఐజీ, ఏపీ ఈగల్ ఆర్గనైజేషన్ డైరెక్టర్ ఆకే రవికృష్ణ

తాడికొండ(లాం), మార్చి 19(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని, లేనిపక్షంలో జీవితం సర్వ నాశనమవుతుందని ఐజీ, ఏపీ ఈగల్ ఆర్గనైజేషన్ డైరెక్టర్ ఆకే రవికృష్ణ తెలిపారు.



విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఐజీ ఆకే రవికృష్ణ

చలపతి విద్యాసంస్థలు ప్రారంభమై 30 సంవత్సరాలు అవ్వటంతో నాలుగురోజుల పాటు మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. బుధవారం ప్రారంభమైన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసి ఆకే రవికృష్ణ, చలపతి విద్యాసంస్థల అధినేత వైవీ ఆంజనేయులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనిషి జీవితంలో విద్యార్థి దశ చాలా ముఖ్యమైందన్నారు. నేటి యువత సినిమాల్లో చూపించే డ్రగ్స్ మాదక ద్రవ్యాలు, ఇతర అసాంఘిక కార్యకలాపాలకు త్వరగా బానిసలు అవుతున్నారన్నారు. మద్యం, గంజాయి, కొకైన్, బ్రౌన్ షుగర్ ఇతర పదార్థాల కు దూరంగా ఉండాలని హెచ్చరించారు. ఈగల్ ఆర్గనైజేషన్ ఎస్పీ కే నగేష్‌బాబు మాట్లాడుతూ నేటి యువత టెక్నాలజీని చెడుమార్గంలో ఉపయోగిస్తున్నారన్నారు. వైవీ ఆంజనేయులు మాట్లాడుతూ చలపతి విద్యాసంస్థలు ఒక స్కూల్‌తో ప్రారంభమై ఇంజనీరింగ్, ఫార్మసీ, డిగ్రీ, జూనియర్ కళాశాలలుగా ఎదిగి ప్రగతి పథంలో ముందుకు దూసుకువెళ్తున్నాయన్నారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ వై సుజిత్‌కుమార్, ప్రిన్సిపాల్ ఎం చంద్రశేఖర్, అకాడమిక్ డీన్ జే లక్ష్మీనారాయణ, ట్రైనింగ్ డీన్ చందు రవిశంకర్, డైరెక్టర్ డీ వినయ్‌కుమార్, నాగగోపిరాజు, డీ తిరుపతినాయుడు, అధ్యాపకులు పాల్గొన్నారు.

తురకా కిశోర్‌ను నెల్లూరుకు తరలించిన పోలీసులు

మాచర్లటౌన్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): పిన్నెల్లి సోదరుల ప్రధాన అనుచరుడు, మున్సిపల్ మాజీ ఛైర్మన్ తురకా కిశోర్, అతని సోదరుడు శ్రీకాంత్‌లను నెల్లూరు జైలుకు తరలించారు. క్రైం నంబరు 69/2022లో ఈనెల 6వ తేదీన మండలంలోని విజయపురిసౌత్ పోలీసులు మంజుల చిన అంజిపై జరిగిన దాడి, కారు ధ్వంసం కేసులో పీటీ వారెంట్ ద్వారా కోర్టుకు హాజరుపరిచారు. ఆ కేసులో రిమాండ్‌పై నెల్లూరులో ఉండగా విచారణ నిమిత్తం కోర్టు ద్వారా రెండు రోజుల అనుమతి పొందిన పోలీసులు మంగళ, బుధ వారాలు గురజాల పోలీసు స్టేషన్లో విజయపురిసౌత్ ఎస్ఐ షేక్ షఫి విచారించి మాచర్ల జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో హాజరుపరిచారు. ప్రభుత్వ న్యాయవాది (పీపీ) పీఆర్ రవీంద్రబాబు వాదనలు వినిపించగా, కిశోర్ తరుపున వరప్రసాద్ వాదనలు వినిపించారు. వాదనల అనంతరం న్యాయమూర్తి పీ ప్రశాంత్ రిమాండ్ కొనసాగింపునకు అనుమతి ఇచ్చా రు. దీంతో విజయపురిసౌత్ పోలీసులు నెల్లూరు జైలుకు తరలించారు. గురువారంతో ఈ కేసులో రిమాండ్ 14 రోజుల గడువు పూర్తి కానుంది.

క్రేన్ గ్రూపు సంస్థల్లో రెండో రోజు కొనసాగిన ఐటీ సోదాలు

గుంటూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ఆదాయపు పన్ను శాఖ అధికారులు గుంటూరు నగరంలోని క్రేన్ గ్రూపు సంస్థల్లో సోదాలను రెండో రోజు కూడా కొనసాగించాయి. మంగళవారం ప్రారంభమైన సోదాలు బుధవారం కూడా కొనసాగాయి. ఈ సందర్భంగా విలువైన బంగారు, వెండి, వజ్రాభరణాలు, కొంత మొత్తంలో నగదు, కీలకమైన పత్రాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. ఈ సోదా లలో ఏమేమి సీజ్ చేసిందనే వివరాలను ఇంకా ఐటీ శాఖ ప్రకటన చేయలేదు.

హత్యకేసులో నిందితుడికి యావజ్జీవ శిక్ష

బాపట్ల, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : మహిళను హత్య చేసిన కేసులో నిందితుడికి యావజ్జీవ కారాగార శిక్ష, 10 వేల రూపాయల జరిమానా విధిస్తూ బాపట్ల ఆరవ అడిషనల్ డిస్ట్రిక్ అండ్ సెషన్స్ జడ్జి కె.శ్యాంబాబు బుధవారం తీర్పునిచ్చారు. ఎస్పీ తుషార్ డూడీ తెలిపిన వివరాలు ప్రకారం.. చంద్రగూడెం గ్రామానికి చెందిన బొల్లిపోగు 2012లో గుంటూరులోని ఓ కళాశాలలో కేర్‌టేకర్‌గా చేరింది. అక్కడే ఎలక్ట్రీషియన్‌గా పనిచేసే గారపాటి రాజశేఖర్ మధ్య ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. 2013 మార్చి 22న బాపట్ల మండలంలోని అడవిగ్రామపంచాయతీ మత్స్యశాఖవారి శిథిలావస్థలో ఉన్న క్వార్టర్స్ సమీపంలోని ఏకాంత ప్రదేశానికి తీసుకొచ్చి లైంగిక కోరికను తీర్చుకున్న తర్వాత పదునైన ఆయుధంతో హత్య చేశాడు. దీనిపై గ్రామపంచాయతీ వీఆర్వో ఇచ్చిన రిపోర్ట్ మేరకు అప్పటి రూరల్ ఎస్ఐ వై.కోటేశ్వరరావు హత్య కేసుగా నమోదు చేశారు. సీఐ వై.రామారావు కేసు దర్యాప్తు చేసి నేరస్థుడిని అరెస్ట్ చేసి కోర్టులో అభియోగపత్రం దాఖలు చేశారు. బాపట్ల ఆరవ అడిషనల్ డిస్ట్రిక్ అండ్ సెషన్స్ కోర్టులో కేసుకు విచారణకు రాగా ఎస్పీ తుషార్ డూడీ ఆదేశాల మేరకు డీఎస్పీ రామాంజనేయులు పర్యవేక్షణలో రూరల్ సీఐ కె.శ్రీనివాసరావు, కోర్టు హెడ్‌కానిస్టేబుల్ ఈశ్వర్, సెషన్స్ కోర్టు హెడ్‌కానిస్టేబుల్ జి.శివయ్యలు, సాక్షులు సరైన రీతిలో సాక్ష్యం చెప్పటంతో నిందితుడు గారపాటి రాజశేఖర్‌కు యావజ్జీవ కారాగార శిక్ష, రూ.10 వేల జరిమాన విధిస్తూ తీర్పు వెలువడినట్లు ఎస్పీ తుషార్ డూడి తెలిపారు.

ఆగి ఉన్న మద్యం లారీని మరో లారీ ఢీ


బోల్తాపడిన మద్యం లోడు లారీ

యడ్లపాడు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : ఆగి ఉన్న మద్యం లారీని వెనుక నుంచి మరో లారీ ఢీకొన్న సంఘటన పదహారో నంబరు జాతీయరహదారిపై యడ్లపాడు వద్ద మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీ 27 వై 2345 నంబరు గల లారీ సింగరాయకొండలోని స్టాక్ పాయింట్ నుంచి మద్యం లోడుతో సామర్లకోటకు మంగళవారం బయలుదేరింది. పిల్లికొండవద్దకు రాగానే డ్రైవర్ లారీని పక్కగా నిలిపి కేబిన్‌లో పడుకున్నాడు. అర్ధరాత్రి సమయంలో అదే మార్గంలో వచ్చిన ఏపీ 39 యూఎన్ 2179 నంబరు గల లారీ ఆగి ఉన్న లారీని వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. లారీ రెయిలింగ్‌ను దాటుకుని సర్వీసురోడ్డులోకి పల్టీకొట్టింది. కేబిన్‌లో పడుకున్న డ్రైవర్‌కు తీవ్రగాయాలయ్యాయి. డ్రైవర్‌ను 108 అంబులెన్స్‌లో జీజీహెచ్‌కు తరలించారు. ఢీకొట్టిన లారీ డ్రైవర్ కునుకు తీయడంతో ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు తెలిపారు. ఎక్సైజ్ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మద్యం బాటిళ్ల ప్లాస్టిక్‌వి కావడంతో నష్టం పెద్దగా ఉండకపోవచ్చని భావిస్తున్నారు.

వేటకు వెళ్ళి నిజాంపట్నం చెందిన మత్స్యకారుడు మృతి


నాగవర్మ మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ తిరుపతిరావు

రేపల్లె, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): వేటకు వెళ్ళి నిజాంపట్నం కలిమి సెంటర్‌కు చెందిన ఒడుగు నాగవర్మ(24) మృతి చెందాడని నిజాంపట్నం ఎస్ఐ తిరుపతిరావు బుధవారం తెలిపారు. నిజాంపట్నం మండలం దిండి పరిశావారిపాలెం బీచ్ వద్ద వేటకు వెళ్ళి ప్రమాదవశాత్తు మునిగిపోవటంతో గాలింపుచర్యల్లో నాగవర్మ మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని ఎస్ఐ పరిశీలించారు. నాగవర్మ తండ్రి నాగబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన తెలిపారు.

మిర్చిని తగలబెట్టిన గుర్తు తెలియని వ్యక్తులు

కారంపూడి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో గుర్తుతెలియని వ్యక్తులు మిర్చి పంటకు నిప్పంటించారు. బాధిత రైతు వజ్రాల సురేష్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలో ఐదు ఎకరాలు కౌలుకు తీసుకుని మిర్చి పంట సాగు చేసి రెండో కోత పూర్తి చేసి మార్కెట్‌కు తరలించేందుకు 50 క్వింటాళ్ల ఎండు మిర్చిని కల్లంలో నిల్వ చేశాడు. మంగళవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు పంటను తగులబెట్టారు. సుమారు రూ. 6 లక్షలు నష్టం జరిగినట్లు బాధితుడు సురేష్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఆదుకోకుంటే ఆత్మహత్యే శరణ్యమంటూ వాపోయాడు.

పురుగుమందు తాగి వ్యాపారి ఆత్మహత్య

ప్రత్తిపాడు. మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మనస్థాపంతో పత్తి కమీషన్ వ్యాపారి పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన పాతమల్లాయపాలెం సమీపంలో జరిగింది. పాతమల్లాయపాలెం గ్రామానికి చెందిన కాసు నాగిరెడ్డి (56) పత్తి కమీషన్ వ్యాపారం చేస్తూ గుంటూరులో నివాసం ఉంటున్నాడు. పది సంవత్సరాలుగా నాగిరెడ్డి రైతుల వద్ద కొనుగోలు చేసిన పత్తిని బొమ్మ కొండారెడ్డికి అమ్ముతుంటాడు. శ్రీకాకుళం జిల్లా దిమ్మిడిజోలా గ్రామపరిధిలో రైతుల వద్ద కొనుగోలు చేసిన పత్తికి సంబంధించి రూ.43 లక్షలు కొండారెడ్డి నుంచి రావలసి ఉంది. ఈ డబ్బు కొండారెడ్డి ఇవ్వకపోగా, కోర్టుకు వెళతా అంటూ బెదిరిస్తున్నాడు. ఒక వైపు రైతుల నుంచి డబ్బుల కోసం వత్తిడి పెరిగి పోవడం, మరో వైపు తనకు ఇవ్వాల్సిన కొండారెడ్డి బెదిరిస్తుండటంతో తీవ్ర మనస్థాపానికి గురైన కాసు నాగిరెడ్డి అప్పులకు సంబంధించి వివరాలతో నోట్ రాసి పొలం వద్ద పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మేరకు నాగిరెడ్డి భార్య రాజ్యలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ప్రత్తిపాడు ఎస్ఐ నాగేంద్ర కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాడు.

పాము కాటుకు రైతు మృతి

నకరికల్లు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : పాము కాటుకు రైతు మృతి చెందిన సంఘటన మండలంలోని నరసింగపాడు గ్రామంలో బుధవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం బోనముక్కల పరమేశ్వర రెడ్డి పొలంలో గేదెలకు గడ్డి కోసే సమయంలో పాము కరవటంతో స్పృహ తప్పి పడిపోయాడు. అతనిని చికిత్స నిమిత్తం వైద్యశాలకు తరలించగా మృతి చెందినట్టు ఈ సందర్భంగా వైద్యులు తెలిపారు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.40 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	109, 117, 128
చికెన్ విత్ స్కిన్(కిలో)	210.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	220.00

1,24,077 మిర్చి టిక్కీల విక్రయం

గుంటూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు బుధవారం 1,27,005 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 1,24,077 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 66,903 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			షార్క్-1	10500	13800
334	9500	13100	బంగారం	11000	12500
నంబరు. 5	10000	13500	బ్యాడిగి 355	--	--
273	10000	13000	సింజెంటా		
341	10500	14500	బ్యాడిగి 5531	10000	13500
4884	10000	12000	ఎన్ఎస్ 250 బుల్లెట్	10000	11500
సూపర్ 10	--	--	ఆర్మూరు	11000	13300
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ					
తేజ	--	--	తాలుకాయలు	5000	7500

కళాశాల అభివృద్ధిలో పూర్వవిద్యార్థుల సహకారం అభినందనీయం

● ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ శారదా జయలక్ష్మి



అలమ్ని హౌస్ మొదటి అంతస్థును ప్రారంభిస్తున్న డాక్టర్ ఆర్.శారదా జయలక్ష్మి

బాపట్ల, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల వ్యవసాయ కళాశాల అభివృద్ధిలో పూర్వవిద్యార్థుల పాత్ర అభినందనీయమని, వారి సహాయ సహకారాలు ప్రస్తుత విద్యార్థులకు ప్రేరణనిస్తాయని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ డాక్టర్ ఆర్.శారదా జయలక్ష్మి అన్నారు. కళాశాలలో నూతనంగా నిర్మించిన అలమ్ని హౌస్ మొదటి అంతస్థును బుధవారం ఆమె ప్రారంభించారు. ప్రారంభ సభలో ఆమె మాట్లాడుతూ పూర్వవిద్యార్థుల సహకారంతో నిర్మించిన ఈ గృహం అతిథులకు ఎంతో సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో విశిష్ట అతిథులుగా డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ పీవీ సత్యనారాయణ, డీన్ ఆఫ్ స్టూడెంట్ అఫైర్స్ డాక్టర్ జి.కరుణసాగర్, డీన్ ఆఫ్ అగ్రికల్చర్ డాక్టర్ సీహెచ్ శ్రీనివాసరావు, రిజిస్ట్రార్ డాక్టర్ జి.రామచంద్రరావు, అసోసియేట్ డీన్ ప్రసూనారాణి, బోధన, బోధనేతర సిబ్బంది, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

విద్య, క్రీడా రంగాలలో మంచి శిక్షణతో ఉన్నత శిఖరాలు

● ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం అధిపతి వందన రవికుమార్

పిట్టలవానిపాలెం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : విద్య, క్రీడా రంగాలలో ఆసక్తి, ఉత్సాహం మంచి శిక్షణ కలిగి ఉండే ప్రతి విద్యార్థి ఉన్నత శిఖరాలను అందుకుంటారని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం అధిపతి ఆచార్య వందన రవి కుమార్ అన్నారు. మండలంలోని ఖాజీపాలెం కేవీఆర్ కేవీఆర్ అండ్ ఎంకేఆర్ డిగ్రీ కళాశాల 44వ వార్షికోత్సవాన్ని మంతెన వెంకటరాజు సేవాసమితి సౌజన్యంతో కళాశాల పాలకవర్గ అధ్యక్షుడు డాక్టర్ మంతెన నరసరాజు అధ్యక్షత నిర్వహించారు. కళాశాల పూర్వ విద్యార్థి 1999-2001 బ్యాచ్‌కు చెందిన వేగేశన భాస్కరరాజును కళాశాల పాలకవర్గం ఆధ్వర్యంలో దుశ్శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించి మెమొంటో అందజేశారు. తొలుత ఆచార్య వందన రవికుమార్, పాలకవర్గం అధ్యక్షుడు డాక్టర్ మంతెన నరసరాజు, కళాశాల పాలకవర్గం ఉపాధ్యక్షుడు మంతెన వెంకటశివరామరాజు, కళాశాల పూర్వవిద్యార్థి సంఘం కార్యదర్శి కె.శివరామరాజులు ముఖ్యఅతిథులు పాల్గొని విద్యార్థినీ, విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కళాశాల పాలకవర్గం సెక్రటరి అండ్ కరస్పాండెంట్ మంతెన శ్రీనివాసకుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులకు జ్ఞాపికలను అందజేశారు. కళాశాలలో విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ టి.శివప్రసాద్, కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



ఆచార్య వందన రవి కుమార్ సత్కరించి మెమొంటో అంతజేస్తున్న కళాశాల పాలకవర్గ అధ్యక్షుడు డాక్టర్ మంతెన నరసరాజు, పాలకవర్గ సభ్యులు

లైసెన్స్‌ల హక్కులకు వేలం

పిట్టలవానిపాలెం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చందోలు గ్రామంలో ఉన్న శ్రీబగళాముఖి అమ్మవారి దేవస్థానానికి సంబంధించి ఆలయ ఆవరణలో బుధవారం ఉదయం 11 గంటలకు బాపట్ల దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ ఎం.గోపి సమక్షంలో లీజు లైసెన్స్‌ల హక్కుల నిమిత్తం బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి జి.నరసింహమూర్తి తెలిపారు. ఈ లీజు లైసెన్స్‌ల హక్కులకు సంబంధించి ఈ వేలంలో మొత్తం 24 మంది పాటదారులు పాల్గొన్నారు. ఆలయంలో లైటింగ్, డెకరేషన్‌కు సంబంధించి కొండవీటి జగదీష్ రూ.లక్ష 12వేలకు పాటపాడుకున్నారు. అదేవిధంగా వంటపాత్రలు, సామానులు సప్లై చేసేందుకు కానగంటి లోకేష్ రూ.73 వేలకు పాటపాడుకున్నారు. అమ్మవారికి భక్తులు సమర్పించే చీరలు సేకరించే హక్కులకు సంబంధించి బాపట్ల శ్రీనివాసరావు రూ.94 వేలకు హెచ్చుపాటదారులుగా నిలిచారు.

కరాటే చాంపియన్‌షిప్‌లో బాపట్ల విద్యార్థులకు పతకాలు

బాపట్ల, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : ఆలిండియా ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ 2025 పోటీలు మచిలీపట్నంలో నిర్వహించారు. ఈ కరాటే పోటీలకు వివిధ రాష్ట్రాలు నుంచి 500 మంది విద్యార్థులు పాల్గొన్నారు. బాపట్ల నుంచి వై.ఎన్‌ఆర్ మార్షల్ ఆర్ట్స్ టీమ్ కోచ్ యర్రా నాగేశ్వరరావు ఆధ్వర్యంలో పలువురు విద్యార్థులు పాల్గొని పతకాలు సాధించినట్లు తెలిపారు. జూనియర్ కటా విభాగంలో పి.యశస్విన్, పి.రామ్‌వరణ్య, సోను నాగసాయిలు గోల్డ్‌మెడల్స్ సాధించారు. సీహెచ్ జయంతిబాబు సిల్వర్‌మెడల్, ఎ.వైష్ణవ్, కె.పర్ణిక సాయిలు బ్రౌంజ్ మెడల్స్ సాధించారు. అదేవిధంగా గూడవల్లికి చెందిన 16 మంది విద్యార్థులు మెడల్స్ సాధించినట్లు తెలిపారు. వీరిలో ఎం.కార్తీక్, పి.బాలాజి, సి.హెచ్.కీర్తన, ఎ.నిత్య, హరిచరిత, గగన, ప్రశంస, ఆయుష, కిషోరిలు గోల్డ్‌మెడల్స్ సాధించారు. పి.కృషి, సిహెచ్.ధన్య, ఎ.సోహిత, దీక్షిత, కీర్తనలు సిల్వర్‌మెడల్స్ సాధించారు. కె.జయంతి, జె.సాన్వితలు బ్రౌంజ్‌మెడల్స్ సాధించినట్లు కోచ్ తెలిపారు. రోటరీ కల్యాణ మండపంలో బుధవారం అభినందన సభ నిర్వహించారు. టీమ్ మేనేజర్లు అవినాష్, గోపి తదితరులు పాల్గొన్నారు.

పరిమితి లేని వైద్య సౌకర్యం కల్పించాలి

బాపట్ల, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : ఏపీఎస్ ఆర్టీసీ నుంచి ఏపీపీటీడీగా మారిన తర్వాత ఆర్టీసి రూల్స్‌కి, పీటీడీ రూల్స్‌కు చాలా వ్యత్యాసం ఉన్నట్లు నేషనల్ మజ్దూర్ యూనిటి అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాసరావు తెలిపారు. పట్టణంలోని కోన భవన్‌లో బుధవారం నేషనల్ మజ్దూర్ యూనిటి అసోసియేషన్ ముఖ్య నాయకులకు శిక్షణ శిబిరం ఏర్పాటు చేశారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆర్టీసీలో ఉన్నట్లు పరిమితిలేని వైద్యసౌకర్యం కల్పించాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.పూర్ణచంద్రరావు, కార్యదర్శి ఎ.రామ్మోహనరావు, బాపట్ల జిల్లా అధ్యక్షులు టి.శ్రీనివాసరావు, శ్రీనివాసరాజు, అద్దంకి,చీరాల,రేపల్లె డిపోల అధ్యక్ష,కార్యదర్శులు పాల్గొన్నారు.

బాపట్ల బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా అవినాష్



కంచర్ల అవినాష్

బాపట్ల, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కంచర్ల అవినాష్‌ను మరోసారి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అవినాష్ గతంలో రెండు పర్యాయములు బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా పని చేశారు. మరలా బుధవారం జరిగిన అసోసియేషన్ ఎన్నికలలో సభ్యులు ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పలువురు ప్రముఖులు, న్యాయవాదులు అవినాష్‌ను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

ఆర్డర్ పొందిన అధ్యాపకులు రిపోర్ట్ చేయాలి

● ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి పి.యర్రయ్య

బాపట్ల, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియట్ ఫిజిక్స్, ఎకనామిక్స్ పేపరు వాల్యుయేషన్ గురువారం నుంచి జరుగుతుంది కావున బోర్డు నుంచి ఆర్డర్ పొందిన అన్ని రకాల మేనేజ్‌మెంట్ కళాశాలలకు సంబంధించిన అధ్యాపకులు తప్పనిసరిగా రిపోర్ట్ చేయాలని ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి పి.యర్రయ్య తెలిపారు. ఈ విషయమై ఆయన మాట్లాడుతూ ఉదయం 9.30కు చీరాల ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో రిపోర్ట్ చేయాలన్నారు. రిపోర్ట్ చేయని వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బొడ్డుపల్లి వెంకటశివకుమార్‌కు డాక్టరేట్ ప్రదానం



బొడ్డుపల్లి వెంకటశివకుమార్

బాపట్ల, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : బాపట్లకు చెందిన బొడ్డుపల్లి వెంకటశివకుమార్ హైదరాబాద్‌లోని బిట్స్ ఫిలానీ విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ డిగ్రీ అందుకున్నారు. బాపట్ల రైల్వేస్టేషన్ కూడలిలోని బొడ్డుపల్లివారి వీధికి చెందిన వెంకటశివకుమార్, ఆచార్య డాక్టర్ కెవిజి చంద్రశేఖర్ పర్యవేక్షణలో డిజైన్ సింథసిస్ అండ్ బయలాజికల్ ఎవాల్యూషన్ ఆఫ్ నైట్రోజన్ బెస్ట్ హెటిరో సైకిల్స్ యాజ్ యాంటీ ట్యుబర్క్యులర్ ఏజెంట్స్ అనే అంశంపై పరిశోధన విజయంతంగా పూర్తి చేసినందుకు డాక్టరేట్ ప్రదానం చేశారు.

శ్మశాన వాటిక వద్ద గుర్తు తెలియని యువకుడి మృతదేహం

కర్లపాలెం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : కర్లపాలెం పంచాయతీ పరిధిలోని బ్రాహ్మణ శ్మశాన వాటిక సమీపంలో బుధవారం గుర్తు తెలియని మృతదేహం లభ్యమైందని కర్లపాలెం ఎస్‌ఐ రవీంద్ర తెలిపారు. పాతకాగితాలు ఏరుకొని జీవనం సాగిస్తున్నాడని, మృతుని వివరాలు తెలియరాలేదన్నారు. కర్లపాలెం వీఆర్వో అమానుల్లా ఇచ్చిన ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ రవీంద్ర వివరించారు.

రేపల్లెలో తాగునీటి ఇక్కట్లు

● రెండుపూటలా రావాల్సిన నీరు ఒక్కపూటే
● మురుగునీరు వస్తోందంటూ ఆవేదన
● పట్టించుకోని మున్సిపల్ అధికారులు

రేపల్లె, మార్చి 19(ఆంధ్రజ్యోతి) : ప్రజలకు సమృద్ధిగా తాగునీరు అందిస్తున్నామంటూ మున్సిపల్ అధికారులు చెబుతున్నారు. ఇందుకు విరుద్ధంగా పట్టణంలో తాగునీరు అందక ప్రజలు నానా ఇక్కట్లు పడుతున్నారు. పురపాలక సంఘంలో 28 వార్డులు ఉండగా వేసవికాలం సమీపించడంతో మున్సిపల్ అధికారులు తాగునీరు అందించడం లేదంటూ పట్టణవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లక్షలాది రూపాయలు వెచ్చించి ప్రజలకు రెండు పూటలా తాగునీరు అందిస్తామంటూ మున్సిపల్ అధికారులు ఆర్భాటంగా ప్రకటన చేస్తున్నారే తప్పా ఆచరణలో సాధ్యం కావడం లేదు. పట్టణంలో రెండుపూటలాతాగునీరు అందించాల్సిన పరిస్థితి ఉన్నా ప్రస్తుతం పట్టణంలో ఉదయం పూట తాగునీరు అందిస్తున్నారు. అది కూడా 20 నిమిషాల్లోపే వస్తున్నాయని, ఈవిధంగా అయితే 60 వేల పైచిలుకు ఉన్న జనాభాకు తాగునీరు ఎలా సరిపోతుందంటూ పట్టణవాసులు ఆరోపిస్తున్నారు. కుళాయిల ద్వారా వచ్చే నీరు మురుగుగా, నలకలతో వస్తున్నాయంటూ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అరవపల్లి రోడ్డు, పెనుమూడి రోడ్డు, పేటేరు రోడ్డు, 28వ వార్డు, 5వ వార్డులో మున్సిపల్ కుళాయిలకు ట్యాప్‌లు లేకపోవటంతో తాగునీరు వృథాగా పోతుంది. ఈ విషయమై మున్సిపల్ అధికారులకు ఎన్నిసార్లు విన్నవించుకున్నా పట్టించుకోకపోవటంతో వచ్చేనీరు సగం నేలపాలు అవుతుంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, పాలకులు దృష్టిసారించి రెండుపూటలా తాగునీరు అందించే విధంగా చర్యలు చేపట్టాలని పట్టణవాసులు కోరుతున్నారు.



పెనుమూడిరోడ్డులోని రాణిగారి సత్రం వద్ద నీరు మురికిగా వస్తున్నాయని తెలుపుతున్న మహిళ



పెనుమూడి రోడ్డు, పేటేరురోడ్డులో ట్యాప్‌లు లేక వృథాగాపోతున్న తాగునీరు



మురికిగా ఉన్న తాగునీరు

కాపీలకు పాల్పడితే కఠిన చర్యలు : డీఈవో

కర్లపాలెం, 19 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని అన్ని పరీక్ష కేంద్రాలలో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయని జిల్లా విద్యాశాఖాధికారి శ్రీరామ్ పురుషోత్తం తెలిపారు. చింతాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రాన్ని డీఈవో శ్రీరామ్ పురుషోత్తం, ఎంఈవో ప్రసాద్ బుధవారం తనిఖీ చేశారు.

పది పరీక్షలకు 12 మంది గైర్హాజరు

మండలంలోని చింతాయపాలెం, ఎంవిరాజుపాలెం, యాజలి జడ్పీ ఉన్నత పాఠశాలలో పది పరీక్షలకు 12 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని మండల విద్యాశాఖాధికారి-2 విజయశ్రీ తెలిపారు.

మద్యం దుకాణంలో ధరలు తనిఖీ చేసిన ఎస్‌ఐ

బాపట్ల, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : బాపట్లలోని సూర్యలంకరోడ్డులో ఓ మద్యం దుకాణంలో క్వార్టర్ బాటిల్స్‌పై రూ.10 అదనపు ధరకు విక్రయిస్తున్నారని వినియోగదారులు ఫిర్యాదు చేశారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎస్‌ఐ మౌనిక అక్కడకు వచ్చి పరిశీలించారు. ప్రస్తుతం బాటిల్‌పై 10 రూపాయల ధర పెంచారని రేట్లు వివరాలు ఆన్‌లైన్‌లో చెక్ చేసుకోవచ్చు అని ఆమె చెప్పారు. దీనిపై కొనుగోలుదారులు సంతృప్తి చెందలేదు.

ఈద్గాల వద్ద శానిటేషన్ పనులు చేపట్టాలి : కమిషనర్

బాపట్ల, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : పవిత్ర రంజాన్‌మాసం సందర్భంగా ముస్లింలకు సంబంధించిన ఈద్గాల పరిసరాలలో శానిటేషన్ పనులు ముమ్మరం చేయాలని కమిషనర్ జి.రఘునాథరెడ్డి సిబ్బందిని ఆదేశించారు. ఆయన బుధవారం శాంతినగర్‌లోని ఈద్గాను పరిశీలించి సిబ్బందికి పలుసూచనలు చేశారు. మున్సిపల్ డీఈ కృష్ణారెడ్డి, శానిటరి ఇన్‌స్పెక్టర్ డి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో బాలిక మృతి



దేవిశ్రీ (ఫైల్)

పిట్టలవానిపాలెం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : పశువుల చావిడిలో ఉన్న కుందేళ్ళతో ఆడుకుంటుండగా విద్యుత్‌షాక్‌కు తగిలి బాలిక మృతి చెందిన సంఘటన ఇది. మండలంలోని జీఎన్‌పాలెం గ్రామపంచాయతీ పరిధిలోని మన్నెంవారిపాలెం గ్రామానికి చెందిన కాసుల సుధాకర్, నాగలక్ష్మిల కుమార్తె దేవిశ్రీ (5) పశువుల చావిడిలో కుందేలతో ఆడుకుంటుండగా విద్యుత్ వైరును ఎలుకలు కొరకటంతో దానిని పట్టుకొని ప్రమాదానికి గురై మృతి చెందింది. బాలిక తండ్రి సుధాకర్ ఫిర్యాదు మేరకు చందోలు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఇసుకకు తవ్విన గోతిలో పడి బాలుడు



ప్రవీణ్ (ఫైల్)

కర్లపాలెం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : ఇసుకాసురుల ధనదాహానికి బాలుడు బలైన సంఘటన మండలంలోని యాజలిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే... యాజలికి చెందిన ఉన్నం కిషోర్, అమృతమ్మ పెద్ద కుమారుడు ప్రవీణ్ (14) నీటిలో మునిగి మృతి చెందాడు. తహసీల్దార్ సుందరమ్మ గోతులు తవ్విన ఇసుకాసురులపై జిల్లా ఉన్నతాధికారులకు సమాచారం అందించి అవసరమైన చర్యలు చేపడతామన్నారు.

యువకుడి అదృశ్యంపై కేసు నమోదు

బాపట్లరూరల్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : ప్రకాశం జిల్లా ఒంగోలు మండలం కరవాది గ్రామానికి చెందిన షేక్ షమీర్‌బాబు బాపట్ల ఇంజనీరింగ్ కళాశాల సమీపంలో ఉన్న ఓ హాస్టల్ ఉంటూ చదువుకుంటున్నాడు. ఈనెల 11వ తేదీ నుండి కనిపించటం లేదని తండ్రి షేక్ శ్రీనుబాషా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ధర్యాప్తు చేస్తున్నామని బాపట్ల రూరల్ పోలీసులు తెలిపారు.

పంచాయతీ కార్యాలయాన్ని తనిఖీ చేసిన డీఎల్‌పీవో

పిట్టలవానిపాలెం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చందోలు గ్రామపంచాయతీ కార్యాలయాన్ని బాపట్ల డీఎల్‌పీవో ఎన్.కుమారస్వామి బుధవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.

అంగన్‌వాడీ సొంత భవనాలకు నిధులు : సీడీపీవో

వేమూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలోని ఐదు మండలాల పరిధిలో 63 అంగన్‌వాడీ కేంద్రాల సొంత భవనాలకు వివిధ సౌకర్యాల నిమిత్తం రూ.28 లక్షల 85 వేల 400లు నిధుల కేటాయింపు జరిగినట్లు సీడీపీవో విజయలక్ష్మి తెలిపారు. ఆమె బుధవారం మండల పరిధిలోని గ్రామాల్లో పర్యటించిన సందర్భంగా 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ, వేమూరు, అమృతలూరు, చుండూరు, భట్టిప్రోలు, కొల్లూరు మండలాల పరిధిలో 100 అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు ఉన్నాయన్నారు. వాటిలో 63 భవనాలకు ప్రత్యేక సౌకర్యాల నిమిత్తంగా నిధుల కేటాయింపు జరిగిందన్నారు. అమృతలూరు, కొల్లూరు మండలాలలో మండల పరిషత్ సభ్యులు స్పందించి ఒక్కొక్క కేంద్రానికి రూ.2 లక్షలు చొప్పున రెండు కేంద్రాలకు కేటాయించారని వివరించారు. అయినప్పటికీ కాంట్రాక్టర్లు సంబంధించిన పనులు చేసేందుకు ముందుకు రావడం లేదని తెలిపారు. నిర్మాణాలు పూర్తి కాకపోయినప్పటికీ ఐదు కేంద్రాలలో తప్పని సరైన పరిస్థితుల్లో కేంద్రాల నిర్వహణను కొనసాగిస్తున్నామన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో సామాజిక వేడుకలు

కొల్లూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీ కేంద్రాల్లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సామాజిక వేడుకలు నిర్వహించారు. మండల పరిధిలోని బొద్దులూరుపాడు అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం నిర్వహించిన వేడుకల్లో సూపర్‌వైజర్ విజయలక్ష్మి పాల్గొని గర్భవతులు కేంద్రాల నుంచి అందించే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం సామాజిక వేడుకల్లో గర్భవతులకు పూలు, పండ్లు అందజేశారు. కార్యక్రమంలో తల్లులు, చిన్నారులతో పాటు అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

బొద్దులూరుపాడులో ఉల్లాస్...

ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు రాత్రివేళ రీసోర్స్ పర్సన్‌లు విద్యను బోధిస్తున్నారని ఎంపీడీవో కె.నరసింహారావు అన్నారు. బొద్దులూరుపాడులో ఆయన మాట్లాడుతూ, అక్షర జ్ఞానం కల్పించేందుకు ప్రభుత్వాలు ఉల్లాస్ కార్యక్రమాన్ని అమలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఏపీఎం రాము, సూపర్‌వైజర్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం తనిఖీ

భట్టిప్రోలు (కొల్లూరు), మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాన్ని ఎంపీపీ డీవీ లలితకుమారి తనిఖీ చేశారు. భట్టిప్రోలులోని పీహెచ్‌సీని ఎంపీపీతో పాటు ఎంపీడీవో ఎస్.వెంకటరమణ, జడ్పీటీసీ టి.ఉదయభాస్కరి బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. వైద్యశాలలో రికార్డులను తనిఖీ చేశారు. వైద్యశాల వెంట ఖాళీ స్థలాన్ని శుభ్రపరిచి నూతన నిర్మాణాలు చేపట్టేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయనున్నట్లు ఎంపీపీ తెలిపారు.

సీసీ రోడ్లకు శంకుస్థాపనలు

భట్టిప్రోలు (కొల్లూరు), మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : రెండు గ్రామాల్లో సీసీ రోడ్లకు ఎంపీపీ లలితకుమారి శంకుస్థాపనలు చేశారు. మండల పరిధిలోని పెదపులివర్రు, ఓలేరు గ్రామాల్లో ఒక్కొక్క సీసీ రోడ్డుకు రూ.5 లక్షల అంచనాలతో నిర్మాణాలకు కొబ్బరికాయ కొట్టి బుధవారం పనులు ప్రారంభించారు. ఎంపీపీ మాట్లాడుతూ, మండల పరిషత్ నిధులు రూ.10 లక్షలు సీసీ రోడ్ల నిర్మాణం నిమిత్తం మంజూరు చేయడం జరిగిందన్నారు. ప్రతి గ్రామంలో సీసీ రోడ్డు, తాగునీరు, సీసీ డ్రెయిన్ల నిర్మాణం నిమిత్తం మండల పరిషత్ నుండి నిధులు మంజూరు చేసి అభివృద్ధి పనులు చేయించడం జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రామబ్రహ్మం, స్థానిక నాయకులు నాగమల్లేశ్వరరావు, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

వాహనాల విస్తృత తనిఖీ

బాపట్ల, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల చీలురోడ్డు సెంటర్‌లో పట్టణ సీఐ ఆర్.రాంబాబు సిబ్బందితో కలిసి వాహనాలు విస్తృతంగా తనిఖీ చేశారు. ప్రతి వాహనాన్ని తనిఖీ చేసి అందులో ఉన్న వస్తువులను పరిశీలించారు. కొద్ది రోజులుగా బాపట్ల పట్టణ, మండలంలో డ్రగ్స్ కలకలం నేపథ్యంలో తనిఖీలు ముమ్మరం చేశారు.

తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు


● జలజీవన్ మిషన్ కింద నియోజకవర్గానికి రూ.22 కోట్లు

బాపట్ల, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలోని బాపట్ల, కర్లపాలెం, పిట్టలవానిపాలెం మండలాలలో తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి జలజీవన్‌మిషన్ కింద రూ.22 కోట్ల 26 లక్షలు మంజూరయ్యాయి. ఇంటింటికి కుళాయి, ఓవర్‌హెడ్‌ట్యాంక్‌లు, పైపు లైన్ విస్తరణ వంటి పనులు చేపట్టనున్నారు. కేంద్ర, రాష్ట్రప్రభుత్వాల ఆధ్వర్యంలో మంజూరైన నిధులతో అనేక పనులు చేపట్టనున్నారు. మొత్తం 63 రకాల పనులకు ఈ నిధులు కేటాయించారు. బాపట్ల మండలంలో 5 వర్క్‌లకు గాను రూ.3,23,39,000 కేటాయించారు. ఈ నిధులతో 627 గృహాలకు ట్యాప్ కనెక్షన్‌లు ఏర్పాటు చేయటంతోపాటు నరసాయపాలెం, మరుప్రోలువారిపాలెం గ్రామాలలో ఓవర్‌హెడ్ ట్యాంక్‌లు నిర్మించనున్నారు. పైపులైన్ విస్తరణ పనులు చేపట్టనున్నారు. అదేవిధంగా మండల ప్యాకేజి కింద బాపట్ల మండలానికి మరో 37 వర్క్‌లు కేటాయించారు. వీటికిగాను 10.22 కోట్లు కేటాయించారు. 3,241 ట్యాప్ కనెక్షన్‌లతోపాటు మరుప్రోలువారిపాలెం సామూహిక రక్షిత తాగునీటి పథకం ఫిల్టర్ల మరమ్మతులు, మైక్రోఫిల్టర్ షెడ్, సంపు వంటివి నిర్మించనున్నారు. బేతపూడి గ్రామంలో రూ.57.40 లక్షలు, నందిరాజుతోటలో రూ.45 లక్షలు, స్టూవర్టుపురంలో రూ.42.4 లక్షలు, కంకటపాలెంలో రూ.42.2 లక్షలు, చెరువులో రూ.50.3లక్షలతో తాగునీటి పథకం పనులు చేపట్టనున్నారు. కర్లపాలెం మండలానికి 7వర్క్‌లు కేటాయించారు. దీనికి గాను రూ.2 కోట్ల 59లక్షల 39వేలు మంజూరు చేశారు. 496 ట్యాప్ కనెక్షన్‌లతోపాటు చింతాయపాలెంలో రూ.81.68 లక్షలతో 2 వర్క్‌లు, గణపవరంలో రూ.75లక్షలతో మరో వర్క్ చేయనున్నారు. దుండివారిపాలెం గ్రామంలో రూ.31.95 లక్షలు, నాగరాజుపాలెంలో రూ.19.25 లక్షలు, తిమ్మారెడ్డిపాలెంలో రూ.28.05 లక్షలు, శ్రీరామ్‌నగర్‌లో రూ.23.25 లక్షలతో పనులు చేపట్టనున్నారు. ప్రత్యేకంగా తిమ్మారెడ్డిపాలెం, శ్రీరామ్‌నగర్‌కు కలిపి ఓవర్‌హెడ్‌ట్యాంక్ నిర్మించి బోరు సౌకర్యం కల్పించి పైపులైన్ ఏర్పాటు చేయనున్నారు. పిట్టలవానిపాలెం మండలానికి 14 వర్క్‌లకు గాను రూ.5కోట్ల 97లక్షల 61 వేలు మంజూరు చేశారు. ఇక్కడ 1643 ట్యాబ్ కనెక్షన్‌లు ఇంటింటా ఇవ్వనున్నారు. అదేవిధంగా అల్లూరు, కత్తివారిపాలెం గ్రామాలలో ఓవర్ హెడ్‌ట్యాంక్‌లు నిర్మించనున్నారు. అల్లూరుకు 198.7, పిట్టలవానిపాలెంకు 44.82, జీఎన్‌పాలెంకు 76.48, కత్తివారిపాలెంకు 76.41 లక్షల రూపాయల చొప్పున కేటాయించారు. మంజూరైన నిధులతో పనులు మొత్తం పూర్తి చేస్తే నియోజకవర్గ ప్రజల తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది.



బాపట్ల మండలంలోని మరుప్రోలువారిపాలెం సామూహిక రక్షిత తాగునీటి పథకం చెరువు

మండల ప్యాకేజి పనులు చేపడుతున్నాం



కె.రాంబాబు

జలజీవన్ మిషన్ కింద మంజూరైన రూ.22కోట్ల 26లక్షలతో చేపట్టే పనులలో బాపట్ల మండల ప్యాకేజి కింద మంజూరైన 37 పనులు చేపట్టనున్నాం. వీటికి సంబంధించి టెండర్లు ప్రక్రియ పూర్తయ్యింది. మిగిలిన పనులకు టెండర్లు పిలవాల్సి ఉంది. బాపట్ల మండలంలో 5 వర్క్‌లు, కర్లపాలెం మండలంలో 7వర్క్‌లు, పిట్టలవానిపాలెం మండలంలో 14వర్క్‌లకు టెండర్లు పిలిచి త్వరితగతిన పనులు ప్రారంభించేవిధంగా చూస్తాం. ఇప్పటికే తగిన ఏర్పాట్లు చేయటం జరిగింది. **- ఆర్‌డబ్ల్యుఎస్ డీఈఈ కె.రాంబాబు**

రైతులకు అధిక రుణ సౌకర్యం కల్పించాలి

● బ్యాంకర్ల సమావేశంలో కలెక్టర్ జె.వెంకటమురళి



బ్యాంకర్ల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ జె.వెంకటమురళి

బాపట్ల, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయంపై ఆధారపడిన జిల్లాలోని రైతులకు బ్యాంకర్లు అధిక రుణ సౌకర్యం కల్పించాలని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. బ్యాంకర్ల జిల్లా స్థాయి సమావేశం బుధవారం కలెక్టరేట్‌లో జరిగింది. ప్రాధాన్యత రంగాలు, ప్రాధాన్యతలేని రంగాలకు రుణాల పంపిణీలో ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను అధికారులు నూరుశాతం చేరుకోవాలని కలెక్టర్ తెలిపారు. 2024-2025 ఆర్థిక సంవత్సరంలో అన్ని రంగాలకు కలిపి నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలని తెలిపారు. గడిచిన రెండునెలలు, రానున్న 25రోజుల్లో నూరుశాతం లక్ష్యాలు చేరుకోవాలని తెలిపారు. కౌలు రైతులకు రూ.100 కోట్ల రుణాలు ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు. 7,900 చేనేత కుటుంబాలకు రుణ సదుపాయం కల్పించేలా ప్రణాళికలు రూపొందించాలన్నారు. ముద్రరుణాల మంజూరులో ప్రస్తుతం 44.40 శాతం లక్ష్యం కాగా నూరుశాతం లక్ష్యాలు చేరుకోవాలన్నారు. సమావేశంలో ఆర్‌బీఐ ఎల్‌డీవో అభిషేక్, నాబార్డు డిడిఎం రవికుమార్, ఎల్‌డీఎం శివకృష్ణ, వివిధశాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

మృతుడి సోదరుడికి ఉద్యోగావకాశం కల్పించిన కలెక్టర్

బాపట్ల, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ఓ నిరుపేద కుటుంబానికి కలెక్టర్ జె.వెంకటమురళి చేయూతనందించారు. కర్లపాలెం మండలం పేరలి గ్రామానికి చెందిన దోమతోటి సందీప్ ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తూ కొంతకాలం క్రితం విద్యుత్ స్తంభంపై షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. ఇటీవల మృతుని తల్లి ప్రజా సమస్యల పరిష్కారవేదికలో కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేసి సమస్యను వివరించారు. కుటుంబ ఆర్థిక పరిస్థితులు దయనీయంగా ఉండటం, కుటుంబానికి జీవనోపాధి లేక ఇబ్బందులు పడటంతో ఆ కుటుంబానికి సహాయం చేయాలని కలెక్టర్ నిర్ణయించుకున్నారు. మృతుడి సోదరుడు సునీల్‌కుమార్‌ను ప్రభుత్వ సాంఘిక సంక్షేమశాఖ వసతి గృహంలో కమాటిగా నియమిస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఎస్సీ సంక్షేమ సాధికారితాధికారిణి జె.రాజాదెబోర ఉన్నారు.

మీసాలవారిపాలెంలో వాటర్‌ట్యాంక్‌కు శంకుస్థాపన



వాటర్‌ట్యాంక్‌కు శంకుస్థాపన చేస్తున్న అనగాని శివప్రసాద్

నగరం, మార్చి 19(ఆంధ్రజ్యోతి) : ప్రతిగ్రామానికి సురక్షితమైన తాగునీటిని అందించటమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్ అన్నారు. మంత్రి అనగాని సత్యప్రసాద్ చొరవతో ఎంపీ కనకమేడల రవీంద్రకుమార్ గ్రాంట్ ద్వారా రూ.40లక్షలు, జలజీవన్‌మిషన్(జేజేఎం)రూ.40లక్షలు కలిపి మీసాలవారిపాలెంలోని వాటర్‌ట్యాంక్‌కు బుధవారం శివప్రసాద్ శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటికి తాగునీటిని సరఫరా చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ పి.శంకరరావు, ఏఈ రామకుమారి, నగరం మండల అభివృద్ధి అధికారి బి.శ్రీనివాసరావు, టీడీపీ మండల అధ్యక్షుడు చింతల సుబ్బారావు, అన్నపూర్ణ, మీసాలవారిపాలెం సర్పంచ్ సుబ్బారావు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నగరం మండలం ఎన్‌ఆర్‌జీఎస్‌లో అవకతవకలు



ఉపాధి హామీ పథకం తనిఖీల్లో పాల్గొన్న ఎన్‌ఆర్‌ఈజీఎస్ బృందం

నగరం, మార్చి 19(ఆంధ్రజ్యోతి) : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో లక్షలాది రూపాయలను దారి మళ్ళించి అనేక అవకతవకలు జరిగాయని తనిఖీ అధికారులు నిర్ధారించారు. ఈనెల 1వ తేదీ నుంచి 16వ తేదీ వరకు వివిధ గ్రామాల్లో ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీలు నిర్వహించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద 17వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదికలో 2023 మార్చి నుంచి 2024 మార్చి వరకు చేపట్టిన పనుల సమీక్ష జరిగింది. నగరం మండలంలోని 27 గ్రామపంచాయతీలలో నిర్వహించిన ఈ తనిఖీలలో మొత్తం రూ.47.32 లక్షలు రికవరీ జరుగుతున్నట్లు డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ ఎ.విజయలక్ష్మి తెలిపారు. ఏపీవో అరుణ, టీఏలు వెంకటరమణ, మురళి, కంప్యూటర్ ఆపరేటర్ ప్రసాద్, ఫీల్డు అసిస్టెంట్‌లతో కలసి ఈ అవకతవకలు జరిపినట్లుగా ఆమె తెలిపారు. ఈ సందర్భంగా కంప్యూటర్ ఆపరేటర్ ప్రసాద్‌ను సస్పెండ్ చేశారు. డ్వామా అసిస్టెంట్ పీడీ సీహెచ్ సువార్తమ్మ, చిరంజీవి, అప్పారావు, ఎంపీడీవో బి.శ్రీనివాసరావు, ఏపీవో సుబ్బరాజు, ఎస్టీఎంలు ఎం.బోనయ్య, ఎ.లోకేశ్వరరెడ్డి, విజిలెన్స్ అధికారి శోభన్‌బాబు, క్వాలిటీ కంట్రోల్ సతీష్, ఆయా పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

చేనేతలకు ఉచిత విద్యుత్ వాగ్దానాన్ని నిలబెట్టుకున్న ప్రభుత్వం

చెరుకుపల్లి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : చేనేతలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇవ్వడానికి రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం తెలపడంపై జాతీయ చేనేత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు సుంకర చిన్నరెడ్డిబాబు బుధవారం ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, విద్యాశాఖా మంత్రి లోకేశ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. చెరుకుపల్లిలోని చేనేత సంఘ కార్యాలయంలో టీడీపీ నాయకులకు స్వీట్లు తినిపించి తమ హర్షాన్ని వ్యక్తం చేశారు. సాగునీటి సంఘాల డిస్ట్రిబ్యూటరీ చైర్మన్ ఎం.రాధాకృష్ణమూర్తి, టీడీపీ మండల అధ్యక్షుడు మల్లాది రామకృష్ణ, రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షుడు దివి రాంబాబు పాల్గొన్నారు.

టిడ్కో గృహాలను లబ్ధిదారులకు అందించాలి


రేపల్లె, మార్చి 19(ఆంధ్రజ్యోతి) : టిడ్కో గృహాలను పూర్తి చేసి తక్షణమే లబ్ధిదారులకు అందించాలని సీపీఎం రేపల్లె పట్టణ కార్యదర్శి సీహెచ్ మణిలాల్ అన్నారు. మండలంలోని గుంటూరువారిపల్లి సమీపంలో నిర్మించిన టిడ్కో గృహాలను బుధవారం సీపీఎం బృందం పరిశీలించింది. ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ హయాంలో లబ్ధిదారుల పేరిట రుణాలు తీసుకుని ప్రభుత్వమే వాడుకుందన్నారు. టీడీపీ ప్రభుత్వం టిడ్కో గృహాలను పూర్తి చేసి లబ్ధిదారులకు అందించాలని, గత ప్రభుత్వం తీసుకున్న బ్యాంకు రుణాలు ప్రభుత్వమే జమ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నేతలు కేవీ లక్ష్మణ్‌రావు, కె.ఆశీర్వాదం, కె.రమేష్, ఎల్.గోపి, కె.నాంచారమ్మ పాల్గొన్నారు.

ఉపాధి హామీ పథకంపై ఫీల్డు అసిస్టెంట్లకు దిశానిర్దేశం

చెరుకుపల్లి, మార్చి 19(ఆంధ్రజ్యోతి) : జాతీయ గ్రామీణ ఉపాధిహామీపథకంలో భాగంగా బుధవారం చెరుకుపల్లి ఎంపీడీవో ఆఫీసులో ఫీల్డ్ అసిస్టెంట్ల సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో షేక్ మహబూబ్ సుభాని మాట్లాడుతూ ప్రతి వేతనదారునికి రూ.300 కూలీ వచ్చే విధంగా మార్కింగ్ ఇవ్వడం, రైతులతో చర్చించి ఫార్మ్‌పాండ్‌లను తవ్వించడం, కంపోస్టు పిట్‌ల గురించి అవగాహన కల్పించి ప్రతి ఒక్క ఇంటిలో కంపోస్టుపిట్ తవ్వించుకునే విధంగా ప్రణాళికలు చేసుకోవాలని సూచించారు. 2025-26సంవత్సరానికి సంబంధించి పనులకు ప్రణాళికలు రూపొందించి ఆమోదం తీసుకోవాలని చెప్పారు. ఈ సమావేశంలో ఈసీ ఎ.మాలతి, ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్యేక ఆధార్ క్యాంపు

చుండూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : గ్రామ సచివాలయాల వద్ద ప్రత్యేక ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఎన్.సుదీప బుధవారం తెలిపారు. ఈ నెల 21 నుంచి 27 తేదీల్లో దుండిపాలెం, పెదగాదెలవర్రు, పెనుగుదురుపాడు, యడ్లపల్లిలో, 19 నుంచి 25 తేదీల్లో అంబేద్కర్‌నగర్, వేటపాలెం, ఆలపాడు, మండూరులో, 22 నుంచి 28 వరకు వలివేరులో, 20 నుంచి 26 తేదీల్లో తొట్టెంపూడి, మోదుకూరులో, 19-25 మున్నంగివారిపాలెం, చినపరిమిలో ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో తెలిపారు.





ఓఆర్ఆర్ ఆమోదం.. బైపాస్ రద్దు

గుంటూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి, గుంటూరు, విజయవాడను అనుసంధానించే అత్యంత కీలకమైన రహదారుల నిర్మాణంపై తాజా పరిణామాలు ప్రజల్లో నిరాశను కల్పిస్తున్నాయి. రాజధాని అమరావతికి చుట్టూ ఔటర్ రింగు రోడ్డు మంజూరైన సంతోషం మిగలకుండా, అప్పటికే మంజూరైన విజయవాడ తూర్పు బైపాస్‌ను రద్దు చేయడం రెండు జిల్లాల ప్రజలను తీవ్ర నిరాశకు గురి చేస్తోంది. రాజధానికి అనుబంధంగా ఉన్న ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లాల ప్రజల రవాణా అవసరాల్లో అత్యంత కీలకమైన ఈ బైపాస్ రద్దుతో ట్రాఫిక్ కష్టాలు ఇప్పట్లో తొలగే అవకాశం లేదని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గుంటూరు, విజయవాడ నగరాల మీదగా వెళ్లే అత్యంత కీలకమైన చెన్నై- కోల్‌కతా జాతీయ రహదారి ఎన్‌హెచ్- 16 ట్రాఫిక్ పద్మవ్యూహంగా మారింది. ఈ రహదారి విజయవాడ బెంజిసర్కిల్, మహానాడు జంక్షన్, రామవరప్పాడు రింగు, రామవరప్పాడు గుండా వెళుతుంది. ఈ నాలుగు చోట్ల గంటల కొద్దీ ట్రాఫిక్ జామ్ అవుతోంది. ఈ నేపథ్యంలో విజయవాడకు తూర్పు, పశ్చిమలుగా రెండు బైపాస్‌లు నిర్మించాలని ప్రభుత్వం భావించింది. ఈ క్రమంలో పశ్చిమ బైపాస్ నిర్మాణం ఒక కొలిక్కివచ్చింది. ఇక తూర్పు బైపాస్ పనులు జరగాల్సి ఉండగా కేంద్ర ప్రభుత్వం దాని అవసరం లేదని తేల్చింది.

కీలకమైన రహదారి..


రాజధాని అమరావతి అభివృద్ధిలో రహదారుల కనెక్టివిటీ, పోర్టుల అనుసంధానం అత్యంత కీలకం. ఈ నేపథ్యంలో విజయవాడ తూర్పు బైపాస్ ఎంతో కీలకమైనది. గుంటూరు, కృష్ణా జిల్లాల ప్రజలు, ప్రధానంగా తీర ప్రాంత ప్రజలను ఎయిర్‌పోర్టుకు అనుసంధానించడంలో ఇదే అత్యంత కీలకమైన రోడ్డుగా భావించారు. ఓఆర్ఆర్ అందుబాటులోకి వచ్చే వరకూ బందరు సీ పోర్టు నుంచి ఎయిర్‌పోర్టును అనుసంధానం చేయడంలో కూడా ఈ రహదారి కీలకమైనది. ఉమ్మడి గుంటూరు, ప్రకాశం జిల్లాలతో పాటు, తూర్పు రాయలసీమ ప్రాంతాల్లోని ప్రజలకు ట్రాఫిక్ లేని రవాణాను అందుబాటులోకి తేవడంలో ఈ బైపాస్ కీలకమైనది. ఈ పరిస్థితుల్లో కిందటేడాది సెప్టెంబరు నెలాఖరున కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ఆమోదముద్ర వేశారు. ఎన్టీఆర్ జిల్లా పొట్టిపాడు టోల్ ప్లాజా నుంచి గుంటూరు జిల్లా చినకాకాని వరకు రూ.50 కి.మీ మేర ఈ రహదారిని నిర్మించేందుకు ఆమోదం తెలిపి రూ2,176 కోట్లు కేటాయించారు.

అలైన్‌మెంటు మార్చితే పోయేదానికి..

ఓఆర్ఆర్, ఈస్ట్ బైపాస్‌ల నిర్మాణం ఒకదానికి ఒకటి దగ్గరగా ఉంటున్నాయన్న కారణం చూపి కేంద్రం ఈస్ట్ బైపాస్‌ను రద్దు చేసింది. వాస్తవానికి ఈస్ట్ బైపాస్ నిర్మాణానికి ఎన్‌హెచ్ఏఐ 3 అలైన్‌మెంట్లను సూచించింది. ఆప్షన్ 1 కింద విజయవాడకు సమీపంగా 41.230 కి.మీ, ఆప్షన్ 2 కింద మరికొంచెం దూరంలో 44.185 కి.మీ, ఆప్షన్-3 కింద విజయవాడకు దూరంగా 45.595 కి.మీ పొడవున బైపాస్ నిర్మించుకునే అవకాశం ఉంది. అయితే ఇందులో మూడో ఆప్షన్‌ను ఎన్‌హెచ్ఏఐ ఓకే చేసింది. ఆ రోడ్డు ఇప్పుడు ఓఆర్ఆర్‌కు సమీపంలో వస్తోందని, అందుకే ఆ రోడ్డు అవసరం ఉండదని చెప్పి కేంద్రం బైపాస్‌ను రద్దు చేసింది. రెండు రోడ్ల పక్కపక్కనే వచ్చే అవకాశం ఉన్నప్పుడు ఆప్షన్ మార్చి తొలి రెండు ఆప్షన్లలో ఏదో ఒక ఆప్షన్‌ను ఎంచుకుంటే బాగుండేదని ప్రజలు భావిస్తున్నారు. ఆ దిశగా రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నించాలని కోరుకుంటున్నారు.

ట్రాఫిక్ కష్టాలు తీరేలా.. ఎయిర్‌పోర్టు కు ఉమ్మడి గుంటూరు జిల్లావాసులు సులభంగా చేరేలా.. రాజధాని అమ రావతి అభివృద్ధిలో కీలకమైన ప్రాజెక్టుగా ఉన్న విజయవాడ తూర్పు బైపాస్‌ను కేంద్రం రద్దు చేసింది. రాజధాని అమరావతికి చుట్టూ ఔటర్ రింగు రోడ్డు మంజూరు చేసిన కేంద్ర ప్రభుత్వం ఇక తూర్పు బైపాస్ అవసరం లేదని తేల్చేసింది. గతంలో కేంద్రమంత్రి నితిన్‌గడ్కరీ తూర్పు బైపాస్‌కు ఆమోదం తెలిపి ప్రత్యేకంగా నిధులను కూడా కేటాయించారు. బైపాస్ నిర్మాణానికి అలైన్‌మెంట్ కూడా ఖరారు చేశారు. ఇక భూ సేకరణ పనులు ప్రారంభమవుతాయనుకుంటున్న సమయంలో తాజాగా మంజూరైన ఓఆర్ఆర్ పేరుతో తూర్పు బైపాస్‌ను రద్దు చేయడం ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లాల ప్రజలను కలవరపెడుతోంది. ఓఆర్ఆర్, తూర్పు బైపాస్ పక్కపక్కగా వస్తాయి.. ఇక బైపాస్ అవసరం లేదని కేంద్రం చెప్పడం భావ్యం కాదని.. అలైన్‌మెంట్ మారిస్తే సరిపోయే దానికి రద్దు చేయడం సరికాదని ఇటు గుంటూరు, అటు విజయవాడవాసులు అభిప్రాయపడుతున్నారు.

- ఆచరణకు నోచుకోని కేంద్ర మంత్రి గడ్కరీ హామీ
- విజయవాడ తూర్పు బైపాస్‌కి రూ.2,176 కోట్లు కేటాయించినా రద్దు
- ట్రాఫిక్ కష్టాలు ఇప్పట్లో తొలగే అవకాశం లేదని గుంటూరు, కృష్ణా జిల్లా వాసుల ఆందోళన
- తూర్పు బైపాస్ రద్దుతో ఎయిర్‌పోర్టు కనెక్టవిటీపై ప్రభావం
- ఎన్‌హెచ్- 16తో ట్రాఫిక్ కష్టాలు.. వెస్ట్ బైపాస్‌తో 10-15 కి.మీ. అదనపు ప్రయాణం



ఈస్ట్ బైపాస్ నమూనా ప్రతిపాదనలు

ట్రాఫిక్ కష్టాలు..

రాజధాని నిర్మాణ నేపథ్యంలో ప్రభుత్వ కార్యాలయాలు, ప్రైవేటు సంస్థల రాక, కార్యకలాపాలు విపరీతంగా పెరిగిపోయాయి. దీంతో విజయవాడలో ట్రాఫిక్ విపరీతంగా పెరిగింది. సాధారణ రవాణాతోపాటు విజయవాడ ఆటోనగర్ రవాణా, బందరు పోర్టు రవాణా కు నాలుగు చోట్ల అవకాశం కల్పించారు. దీంతో మహానాడు జంక్షన్, రింగురోడ్డు జంక్షన్, రామవరప్పాడు గ్రామాల్లో ట్రాఫిక్ గంటల కొద్దీ ఆగి పోతోంది. దీంతో ఎయిర్‌పోర్టు చెకిన్ వద్ద ప్రయాణికులు ఇబ్బందులు పడు తున్నారు. విజయవాడ వెస్ట్ బైపాస్ నుంచి ఎయిర్‌పోర్టుకు వెళ్లాలంటే పొట్టి పాడు టోల్‌గేటు వరకు వెళ్లి, అక్కడి నుంచి తిరిగి వెనక్కి రావాల్సి ఉంటుంది. అలా చేస్తే కనీసం 10 నుంచి 15 కి.మీ మేర అదనంగా ప్రయాణించాల్సి ఉంటుంది. అదే ఈస్ట్ బైపాస్ అయితే నేరుగా ఎయిర్‌పోర్టుకు కనెక్టివిటీ ఉంటుంది. ఈస్ట్ బైపాస్ రద్దు వల్ల రాజధాని అమరావతి సహా, గుంటూరు, తెనాలి, మంగళగిరి, రేపల్లె, దుగ్గిరాల, పొన్నూరు, చిలకలూరిపేట, మార్టూరు తదితర ప్రాంతాల ప్రజలతోపాటు కృష్ణా జిల్లాలోని బందరు, అవనిగడ్డ, పామర్రు, గుడివాడ ప్రజలు ఎయిర్‌పోర్టుకు వెళ్లాలంటే ఇబ్బందులు పడక తప్పదు.

బాపట్ల కేంద్రంగా డ్రగ్స్ దందా
విద్యార్థుల్లే టార్గెట్‌గా సాగుతున్న విక్రయాలు

మత్తు..చిత్తు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

గంజాయి.. డ్రగ్స్.. మత్తు బిళ్లల దందా బాపట్ల కేంద్రంగా సాగుతోంది. గత వైసీపీ హయాంలో గంజాయి విక్రయాలు జరిగాయి. అయితే ప్రభుత్వం మారి గంజాయిపై కఠినంగా ఉంటున్నా జిల్లాలో మాత్రం ఇంకా ఆ ఆనవాళ్లు దర్శనమిస్తూనే ఉన్నాయి. గత వైసీపీ ప్రభుత్వం తాలూకా నిర్లిప్తత ఇంకా అధికారులను వీడకపోవడంతో గంజాయి, డ్రగ్స్ దందా యథేచ్ఛగా సాగుతోంది. ఇటీవల టాబ్లెట్ల విక్రయాలు, బహిరంగంగా మత్తు ఇంజక్షన్లు ఘటనలు చూసి జిల్లావాసులు షాక్‌కు గురయ్యారు. ఇటీవల బాపట్ల రూరల్ పరిధిలో డ్రగ్స్ అవశేషాలు కలిగి ఉన్న 1600 టాబ్లెట్లు ఓ సాధారణ మహిళ దగ్గర లభ్యమవడం మరింత కలవరపెడుతోంది. ఈ టాబ్లెట్లు పట్టుబడిన ప్రాంతానికి సమీపంలోనే ఓ ప్రముఖ కళాశాల ఉండడంతో విద్యార్థులు టార్గెట్‌గా సాగుతున్న మత్తు పదార్థాల అమ్మకాన్ని కట్టడి చేసే విషయంలో వ్యవస్థల వైఫల్యం పక్కాగా కనబడుతోంది. ఇది కూడా ఎక్సైజ్ సిబ్బంది నాటుసారా తనిఖీలకు వెళ్లగా యాదృచ్ఛికంగా జరిపిన సోదాల్లో టాబ్లెట్లు వెలుగుచూశాయి. దందా వ్యవస్థీకృతంగా నడిస్తే తప్ప మత్తు అవశేషాలు కలిగిన టాబ్లెట్ల విక్రయాలు జరగవనేది అందరికీ తెలిసిందే. వీటి తయారీ ఎక్కడ జరుగుతుంది అనే అంశంతో పాటు ఏ ప్రాంతం నుంచి వాటి సరఫరా జరుగుతుంది, గతంలో పట్టుబడిన గంజాయి నిందితుల పాత్ర ఏమన్నా ఈ రాకెట్‌లో ఉందా అనేకోణంలో కూడా విచారణ చేపట్టాల్సి ఉంది.

పోలీసుల అదుపులో ముగ్గురు యువకులు

బాపట్లలోని జమ్ములపాలెం ఆర్‌వోబీ మెట్లపై మత్తు ఇంజక్షన్లు చేసుకుంటున్న ముగ్గుర్ని యువకులను అదుపులోకి తీసుకొని విచారించినట్లు సీఐ ఆర్.రాంబాబు తెలిపారు. రైలుపేటకు చెందిన కీర్తి వంశీ, భీమావారిపాలేనికి చెందిన షేక్.రియాజ్, ఇస్లాంపేటకు చెందిన ఓ బాలుడు మెడికల్ షాపులలో పెయిన్ కిల్లర్స్ టాబ్లెట్స్ తీసుకుని వాటిని పొడిగా చేసి నీళ్లల్లో కలిపి ఇన్సులిన్ చేసుకున్నట్లు చేసుకుని మత్తులోకి వెళుతున్నట్లు గుర్తించామన్నారు. దీంతో వీరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు

తీవ్రత తెలిసినా.....అదే నిర్లక్ష్యం...

విద్యార్థులు టార్గెట్‌గా కళాశాలలను అడ్డాగా చేసుకుని మత్తు పదార్థాలు అమ్ముతున్న ఉదంతాలు గతంలోనూ వెలుగు చూశాయి. ఈ దఫా ఏకంగా అది టాబ్లెట్ల వరకు విస్తరించింది. అయినా క్షేత్రస్థాయిలోని సిబ్బంది విచారణలో వేగం చూపించడం లేదు. డ్రగ్స్ అవశేషాలు ఉన్న మాత్రలు దొరికి ఇప్పటికీ నాలుగు రోజులు అవుతున్నా విచారణ విషయంలో ఒక్క అడుగు ముందుకు పడలేదని సమాచారం. పట్టుబడిన మాత్రలను ల్యాబ్ పరీక్షలకు పంపడం విషయంలో కూడా ఇంకా ఓ నిర్ధరణకు రాలేదనేది సమాచారం. ఇక ఈ విషయం అటుంచితే బాపట్లలోని జమ్ములపాలెం ఆర్‌వోబీ మెట్లపై బహిరంగంగా ముగ్గురు యువకులు మత్తు ఇంజక్షన్లు చేసుకుంటున్న ఘటన కూడా ఎవరో ఫోన్‌లో వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేసే వరకు పోలీసులకు తెలియకపోవడం విశేషం.

ఒకరిమీద ఒకరు నెపంతో...

టాబ్లెట్లతో ఉన్న నిందితురాలిని పట్టుకుంది ఎక్సైజ్ సిబ్బంది కాగా, విషయం డ్రగ్స్ విభాగానిది కావడంతో విచారణను అక్కడకు పురమాయించారు. కానీ తాము పట్టుకున్నాం, డ్రగ్ విభాగానికి అప్పగించామని ఎక్సైజ్ విభాగం చేతులు దులుపుకోగా, విచారణలో నిందితురాలు కానీ, ఆ ప్రాంతవాసులు సహకరించడం లేదని డ్రగ్స్ విభాగం అధికారులు చెబుతున్నారు. కేసులు నమోదు చేయడమే తమ ఘనత అన్నట్లుగా వ్యవస్థలు ఉంటున్నాయే తప్పితే మూలాలు ఛేదించి మళ్లీ పునరావృతం కాకుండా చూద్దామన్న చిత్తశుద్ధి కొరవడుతోంది. కీలకమైన కేసుల విషయంలో మానిటరింగ్ చేయాల్సిన ఉన్నతాధికారులు కూడా పట్టించుకోకపోవడంతో కిందిసాయి యంత్రాంగం తమకు తోచినప్పుడు తూతూమంత్రంగా విచారణ చేసి మమ అనిపిస్తున్నారు తప్పితే గంజాయి అమ్మకాలను కట్టడి చేయడానికి అనుసరించాల్సిన వ్యూహాలే కరువయ్యాయి. మొక్కుబడిగా కళాశాలల్లో అవగాహన సదస్సులు పెట్టి మమ అనిపించడం తప్పితే నిఘా వ్యవస్థలు కూడా పనితీరు కూడా ఆశాజనకంగా ఉండడం లేదు.

జలజీవన్ మిషన్‌కు రూ.149 కోట్లు

1 మంజూరైన పనులకు టెండర్లు పిలవాలి 1 అధికారులకు కలెక్టర్ వెంకటమురళి ఆదేశం

బాపట్ల, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): జలజీవన్ మిషన్ కింద జిల్లాకు రూ.149 కోట్లు మంజూరైనట్లు కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. డిస్ట్రిక్ వాటర్ శానిటేషన్ మిషన్ జిల్లా స్థాయి కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో 337 పనులకు నిధులు మంజూరయ్యాయన్నారు. జలజీవన్‌మిషన్ కింద మంజూరు చేసిన పనులకు టెండర్లు పిలవాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు తాగు నీటి ఇబ్బందులు రాకుండా సమ్మర్ యాక్షన్ ప్లాన్ తయారు చేయాలన్నారు. జిల్లాలోని సమగ్రనీటి సరఫరా పథకాలు, తాగునీటి బోర్ల మరమ్మత్తులకి అవసరమైన ప్రణాళికలు తయారు చేయాలని సూచించారు. జిల్లాలోని తాగునీటి పథకాల మరమ్మత్తులకి 15వ ఆర్థిక సంఘ నిధులపై సమగ్ర నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాలలో టాయిలెట్ల మరమ్మత్తులకి ప్రతిపాదనలు తయారు చేయాలన్నారు. మురుగు నీటి కాల్వల నిర్మాణాలకు పంచాయతీకి రూ.50 లక్షలు నిధులు మంజూరు చేసేవిధంగా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. సముద్రతీరంలో ఆరు బీచ్‌ల వద్ద 10 బయో టాయిలెట్స్‌ను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా గ్రామీణ నీటిసరఫరాశాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ అనంతరాజు, డీపీవో ప్రభాకర్, డ్వామాపీడీ విజయలక్ష్మి, స్త్రీశిశు సంక్షేమశాఖ పీడీ రాదామాధవి, జిల్లా వ్యవసాయాధికారి రామకృష్ణ, గుంటూరు, ప్రకాశం జడ్పీ డిప్యూటీ సీఈవోలు కృష్ణ, బాలమ్మ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ జె.వెంకటమురళి

రంజాన్ వేళలు
ఇఫ్తార్ : 6.24 (గురువారం సాయంత్రం)
సహరి : 4.55 (శుక్రవారం ఉదయం)

పేటలో సిండికేట్లు

చిలకలూరిపేటలో గంట ముందే వైన్స్ మూత

(చిలకలూరిపేట, ఆంధ్రజ్యోతి)

వ్యాపారం.. అంటే ఎక్కడైనా పోటీ ఉంటుంది. కానీ చిలకలూరిపేటలో మద్యం వ్యాపారులు కలిసికట్టుగా వ్యాపారం చేసుకుంటూ మందుబాబులను దోచుకుం టున్నారు.. ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారు. వీరికి అధికార పార్టీ నేతల అండగా ఉంటుండగా.. చర్యలు తీసుకోవాల్సిన ఎక్సైజ్, పోలీసు అధికారులు మామూళ్ల మత్తులో జోగుతున్నారు. సాధారణంగా ఎక్కడైనా వైన్స్‌ల్లో నిబంధనలకు విరుద్ధంగా ఎక్కువ సమయం మద్యం విక్రయాలు చేస్తుంటారు. కానీ చిలకలూరిపేటలో ఇందుకు భిన్నంగా నిర్ణీత సమయం కన్నా ముందుగానే మూసివేస్తున్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా చిలకలూరిపేటలో పరిస్థితి నెల కొంది. చిలకలూరిపేటలో మొత్తం 11 బార్లు, 6 వైన్సు ఉండగా 9 బార్లు 6 వైన్ షాపుల వారు సిండికేట్ అయ్యారు. వీరంతా కలిసి ఒకవైపు మందుబాబులను దోచుకుంటూ మరోవైపు ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా నిబంధనల ప్రకారం రాత్రి 10 గంటలకు వైన్ షాపులు మూసి వేయాలి. అయితే రాత్రి 9 గంటలకే ఇక్కడ వైన్ షాపులను మూసి వేస్తున్నారు. మందుబాబులకు రాత్రి 9 గంటల నుంచి మద్యం దొరకకుండా చేస్తున్నారు. దీంతో తప్పని సరిగా మందు బాబులు బార్లకు వెళ్లాల్సి వస్తోంది. ఇక ఇక్కడ అదనపు ధర పెట్టి కొనుగోలు చేయాల్సిన పరి స్థితిని సృష్టించారు. నిబంధనలను అతిక్రమించి బార్లు, వైన్ షాపుల నిర్వాహకులు వ్యాపారం చేస్తున్నారు.

నెల రోజులుగా తగ్గిన ఇండెంట్

బార్ల నిర్వాహకులు నరసరావుపేటలోని ఎక్సైజ్ డిపో నుంచి మద్యం కొనుగోలు చేస్తారు. నెల రోజులుగా డిపో నుంచి కొనుగోలు చేసే సరుకు సగానికి సగం తగ్గించారు. బార్ల వ్యాపారులు నిత్యం 50 శాతం సరుకు కొనుగోలు ఇండెంట్ మాత్రమే పెడుతున్నారు. మిగతా సగం సరుకును వైన్‌షాపుల నుంచి సేకరిస్తున్నారు. ఈ సరుకుపై క్వార్టర్ బాటిల్‌కు రూ.50 చొప్పున ధర పెంచి బార్లలో విక్రయిస్తున్నారు. వచ్చే లాభాన్ని బార్లు, వైన్ షాపులవారు కలిసి పంచుకుంటున్నారు.

వైసీపీకి మర్రి షాక్

- ఎమ్మెల్సీ పదవికి రాజీనామా
- రెండు రోజుల్లో పార్టీకి రాజశేఖర్ గుడ్‌బై
- అనుయాయులతో కలిసి త్వరలో టీడీపీలో చేరిక
- వరుస పరాభవాలు.. జగన్‌పై ఆగ్రహంతో నిర్ణయం



గుంటూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ఆవిర్భావం నుంచి పార్టీకి వెన్నుదన్నుగా ఉండటమే కాకుండా ఉమ్మడి గుంటూరు జిల్లాలో తొలుత రథ సారధ్యం వహించిన మర్రి రాజశేఖర్ వైసీపీకి షాకిచ్చారు. ఎంతోకాలం నుంచి అందరూ ఊహించినట్లుగానే మాజీ ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ వైసీపీని వీడేందుకు సిద్ధమయ్యారు. ఇందులో భాగంగా ఆయన తొలుత వైసీపీ ద్వారా తాను పొందిన ఎమ్మెల్సీ పదవిని వదిలేసుకున్నారు. ఈ మేరకు రాజీ నామా పత్రాన్ని బుధవారం శాసనమండలి చైర్మన్‌కు అందజేశారు. చిలకలూరిపేటలో కాంగ్రెస్‌లో రాజకీయ ప్రస్థానం ప్రారంభించి అనంతరం వైసీపీ ఆవిర్భావంతో ఆ పార్టీలో చేరారు. అయితే విడదల రజిని రాజకీయ అరంగేట్రంతో నియోజకవర్గంలో మర్రి రాజశేఖర్ ప్రాధాన్యం తగ్గిపోయింది. 2019 ఎన్నికల్లో ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్న రాజశేఖర్‌ను కాదని వైసీపీలో కొత్తగా చేరిన విడదల రజినికి సీటు ఇవ్వడంతో మర్రి అనుయాయులు తిరుగుబాటు చేశారు. ఆ సమయంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా చిలకలూరిపేట వెళ్లిన వైఎస్ జగన్ రజినిని గెలిపిస్తే రాజశేఖర్‌కు ఎమ్మెల్సీ ఇచ్చి మంత్రిని చేస్తానని హామీ ఇచ్చారు. ఎన్నికల తర్వాత కనీసం ఎమ్మెల్సీ పదవి కూడా వెంటనే ఇవ్వకుండా రజినికి మంత్రి పదవిని కట్టబెట్టారు. ఈ క్రమంలో వరుస పరాభవాలతో రగిలిపోతున్న ఆయన కొద్దికాలంగా పార్టీకి దూరంగా ఉంటున్న విషయం తెలిసిందే. ఈ పరిస్థితుల్లో గుంటూరు పశ్చిమలో ఓడిపోయిన మాజీ మంత్రి విడదల రజినిని తిరిగి చిలకలూరిపేటకు ఇన్‌చార్జిగా నియమించారు. దీంతో ఆయన ఉక్రోషంతో రగిలి పోయారు. ఆ సమయంలోనే ఆయన వైసీపీని వీడతారని కథనాలు వెలువడ్డాయి. అంతకు మునుపు జగన్ రాజశేఖర్‌ను పిలిపించుకుని చిలకలూరిపేట ఇన్‌చార్జి బాధ్యతలు ఇస్తానని హామీ ఇవ్వడమే కాకుండా వచ్చే ఎన్నికల్లో సతీమణికి సీటు ఇస్తానని ఆశ పెట్టారని సమాచారం. ఇది జరిగిన కొద్ది రోజులకే రజిని చక్రం తిప్పడం ఆ తర్వాత వారం రోజులు గడవక ముందే మర్రికి ఇచ్చిన హామీని జగన్ తుంగలో తొక్కి చిలకలూరిపేట ఇన్‌చార్జి బాధ్యతలు రజినికి కట్టబెట్టటంతో మర్రి అవాక్కయ్యారు. ఇక ఆ రోజు నుంచే ఆయన టీడీపీలో చేరాలని నిర్ణయించుకున్నారు. 2023లో ఆయనకు ఎమ్మెల్సీ ఇవ్వగా 2029 వరకు ఆ పదవిలో కొనసాగే అవకాశం ఉన్నా కూడా పదవికి రాజీనామా చేయడం విశేషం. గత ఎన్నికల సమయంలో వైసీపీని వీడి టీడీపీలో చేరి తిరిగి ఎంపీగా గెలుపొందిన లావు శ్రీకృష్ణదేవరాయులతో రాజశేఖర్‌కు సన్నిహిత సంబంధాలున్నాయి. కాగా త్వరలో మంచి ముహూర్తం చూసుకుని తన అనుయాయులతో వైసీపీకి గుడ్ బై చెప్పి టీడీపీలో చేరేందుకు ఆయన సన్నద్ధమవుతున్నారు.

మండల పరిషత్ అధ్యక్షుల ఎన్నిక 27న

- ఉమ్మడి గుంటూరు జిల్లాలో మూడు స్థానాల్లో ఖాళీలు
- అదే రోజున ఉపాధ్యక్ష, కో-ఆప్షన్ సభ్యుల ఎంపిక

గుంటూరు సిటీ, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ ల్లో ఎన్నికల నగారా మోగింది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఖాళీ గా ఉన్న మండల పరిషత్ అధ్యక్ష, ఉపాధ్యక్ష, కో-ఆప్షన్ సభ్యుల ను ఎన్నుకునేందుకు ఎన్నికల కమిషన్ బుధవారం అనుమతి ఇచ్చింది. తొలుత ఆయా పదవులు ఖాళీగా ఉన్న మండలాలకు కలెక్టర్ ప్రత్యేక అధికారులను నియమిస్తారు. నియమించబడిన ప్రత్యేక అధికారులు ఈ నెల 23 నాటికి మండల పరిషత్‌లోని సభ్యులకు నోటీసులు అందజేస్తారు. 27న నిర్వహించే ప్రత్యేక సాధారణ సమావేశంలో ఎంపీపీ, ఉప ఎంపీపీ, కో-ఆప్షన్ సభ్యుల ను ఎన్నుకుంటారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని అచ్చంపేట, పిట్టలవానిపాలెం, దుగ్గిరాల మండల పరిషత్‌ల్లో అధ్యక్ష స్థానాలు ఖాళీగా ఉన్నాయి. నరసరావుపేట, గుంటూరు రూరల్, కారంపూడి మండలాల్లో ఉపాధ్యక్ష స్థానాలు ఖాళీగా ఉన్నాయి. భట్టిప్రోలు, తెనాలి, ముప్పాళ్ల మండల పరిషత్‌ల్లో కో-ఆప్షన్ సభ్యుల స్థానాలు ఖాళీగా ఉన్నాయి. ఆయా స్థానాల్లో ఎన్నికల కార్యక్రమం నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

విద్యుత్ బిల్లుల నుంచి విద్యాలయాలకు విముక్తి

- సుమారు రూ.20లక్షల వరకు ఊరట
- కూటమి ప్రభుత్వానికి ఉపాధ్యాయుల కృతజ్ఞతలు

చీరాల, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలో విద్యుత్ బిల్లులు పెండింగ్‌లో ఉండగా, నానా యాతన పడుతున్న ఉపాధ్యాయులకు టీడీపీ కూటమి ప్రభుత్వం తీపి కబురు అందజేసింది. గత వైసీపీ పాలకులు విద్యారంగ అభివృద్ధిని గాలికొదిలేశారు. కేవలం ప్రచారార్భాటాలకే పరిమితమయ్యారు. విద్యార్థులకు అందించిన కిట్‌లు నాణ్యతా లోపంతో రోజులకే మూలనపడ్డాయి. నాడు - నేడు అంటూ కాసులు దండుకుందే తప్ప పూర్తి స్థాయిలో పనులు జరిగిన దాఖలాలు లేవు. ఈక్రమంలో నిధులు లేక విద్యాలయాలు అభివృద్ధికి నోచుకోక పాఠశాలల పరిస్థితి దయనీయంగా మారింది. దీంతో విద్యుత్ బిల్లులు మోత మోగడంతో అప్పట్లో కొంత వరకు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తిప్పలు పడి కొంత



మేరకు బిల్లులు చెల్లించారు. అయినా పూర్తి స్థాయిలో చెల్లింపులు జరగక గతంలోనే ఆయా విద్యాలయాలకు విద్యుత్ శాఖ నుంచి నోటీసులు అందాయి. ఈవిధంగా దుర్భర పరిస్థితులలో ఉన్న పాఠశాలలకు కూటమి ప్రభుత్వం వరాల జల్లు కురిపించింది. పెండింగ్‌లో ఉన్న బిల్లులను మేమే కడతామని అసెంబ్లీ సమావేశాల్లో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రకటించడంతో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు హమ్మయ్య అంటూ ఊపిరిపీల్చుకుంటున్నారు. మంత్రి లోకేష్ ప్రకటనతో చీరాల పట్టణం, గ్రామీణ ప్రాంతాల్లోని సుమారు 84 స్కూళ్లకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న రూ.12 లక్షలు, వేటపాలెం మండల పరిధిలోని 54 స్కూళ్లకు పెండింగ్‌లో ఉన్న సుమారు రూ.8 లక్షల కరెంట్ బిల్లులు ఉపాధ్యాయులకు భారంగా మారేవి. ఎట్టకేలకు ప్రభుత్వ నిర్ణయంతో ఊరట లభించింది.

సర్క్యులర్ అందాల్సి ఉంది



ప్రభుత్వం తాజాగా ప్రకటించిన విద్యుత్ బిలులు చెల్లింపుల విషయం విద్యా రంగానికి ఊరటనిచ్చింది. అయితే సర్క్యులర్ అందాక పూర్తిగా పరిశీలన చేసిన అనంతరం పాఠశాలలకు అమలు చేస్తాం.

- సుబ్రహ్మణ్యేశ్వరరావు, చీరాల మండల విద్యాశాఖ అధికారి

ప్రభుత్వ నిర్ణయం ఆనందదాయకం



గతంలో విద్యుత్ సమస్యల కారణంగా బిల్లుల చెల్లింపుల్లో చా లా ఇబ్బందులు పడ్డాం. ప్రస్తుతం ఇంకా రూ.50వేల బకాయి ఉన్నాం. పలుమార్లు మా సొంత జీతాల నుంచి చెల్లింపులు చేశాం. ఈక్రమంలో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం చాలా సంతోషంగా ఉంది.

- మెడబలిమి శేఖరరావు
పందిళ్లపల్లి ప్రధానోపాధ్యాయులు

నిర్ణయం భేష్



విద్యుత్ బిల్లులు కట్టేందుకు నానా తంటాలు పడ్డాం. ఇంకా రూ.40 వేలు వరకు బకాయి పడ్డాం. జీతాలు ఆపుకుని బిల్లులు చెల్లించాం. తాజా నిర్ణయంతో స్కూళ్లకు పూర్వ వైభవం అందుకుంటుంది. మాకు భారం తగ్గుతుంది. థాంక్యూ సీఎం.

- శ్రీనివాసరావు, ప్రధానోపాధ్యాయుడు
వాడరేవు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల



మైలవరంలో బస్సు ఎక్కేందుకు సిద్ధంగా ఉన్న విద్యార్థులు

టెన్త్ విద్యార్థులకు బస్సు

మైలవరం నుంచి ప్రారంభమైన ఆర్టీసీ సేవలు

అద్దంకి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): పదోతరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల కోసం ఎట్టకేలకు అద్దంకి ఆర్టీసీ డిపో అధికారులు బస్సును ఏర్పాటు చేశారు. అద్దంకి మండలం మైలవరం హైస్కూల్ నుంచి 45 మంది 10వ తరగతి విద్యార్థులు బల్లికురవ మండలం వైదనలోని పరీక్షా కేంద్రానికి వెళ్లాల్సి ఉంది. ముందుగా విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యా కమిటీ చైర్మన్ కృష్ణమారుతీ ఆర్టీసీ అధికారులను కలిసి సమస్యను వివరించినా బస్సు ఏర్పాటుకు ఒప్పుకోలేదు. దీంతో సోమవారం విద్యార్థులు ఆటోలలో పరీక్షా కేంద్రానికి వెళ్లారు. ఆంధ్రజ్యోతిలో సోమవారం కథనం ప్రచురితం కావడంతో పాటు సమస్యను విద్యా కమిటీ చైర్మన్ కృష్ణమారుతి పోలీస్ అధికారుల దృష్టికి తీసుకుపోవడంతో సీఐ సుబ్బరాజు ఆర్టీసీ డీఎం రామ్మోహనరావుతో ఫోన్‌లో మాట్లాడారు. బుధవారం నుంచి ఐదురోజులపాటు పరీక్షలకు బస్సు సేవలను కల్పించినట్లు డీఎం రామ్మోహనరావు హామీ ఇచ్చారు. దీంతో బుధవారం ఉదయం మైలవరం నుంచి పరీక్షా కేంద్రానికి విద్యార్థులను తీసుకువెళ్లి తిరిగి పరీక్ష ముగిశాక మైలవరంకు చేర్చేలా బస్సును ఏర్పాటు చేశారు. దీనిపై తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

రేపు వలపర్లలో ఆంజనేయస్వామి తిరునాళ్ల

మార్టూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వలపర్ల గ్రామంలో సాగర్ కాలువ పక్కన ఉన్న ఆంజనేయస్వామి దేవస్థానం తిరునాళ్ల మహోత్సవాన్ని శుక్రవారం నిర్వహిస్తున్నట్లు బుధవారం కమిటీ సభ్యులు బుధవారం ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం దేవస్థానంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, రాత్రి పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. అంతేగాకుండా భారీగా అన్నదానాన్ని కూడా ఏర్పాటు చేసినట్లు సభ్యులు తెలిపారు.

రేపు నర్సరీల నిర్వహణపై సదస్సు

మార్టూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రాజుపాలెం సెంటర్ వద్ద శ్రీసాయి బాలాజీ కల్యాణ మండపంలో శుక్రవారం ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని నర్సరీ యజమానులకు రక్షిత వ్యవసాయ సాగు పద్ధతులు, నర్సరీల నిర్వహణపై అవగాహన సదస్సును ఏర్పాటు చేసినట్లు ఉద్యాన అధికారి బీ హనుమంతనాయక్ బుధవారం ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి జిల్లాలోని నర్సరీ యజమానులందరూ హాజరుకావాలని ఆయన కోరారు.

పర్చూరు బార్ అసోసియేషన్ అధ్యక్షునిగా జాన్‌బాబు



అధ్యక్ష, కార్యదర్శులు జాన్‌బాబు, రుక్సానా

పర్చూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : పర్చూరు బార్ అసోసియేషన్ అధ్యక్షునిగా పూరిమెట్ల జన్‌బాబును బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యదర్శిగా షేక్ రుక్సానా, జాయింట్ సెక్రటరీగా కాసా అశోక్ కుమార్, కోశాధికారిగా కరి ప్రవీణ్ నియమితులయ్యారు. 2025-26 సంవత్సరానికి సంబంధించి పర్చూరు కోర్టు భవనాల సముదాయ బార్‌అసోషియేషన్ ప్రతినిధులుగా కొనసాగుతారు. నూతనంగా ఎంపికైన కమిటీని న్యాయవాదులు అభినందించారు.

రూ.15లక్షలతో వాకింగ్ ట్రాక్ నిర్మాణం

ఇంకొల్లు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : నాగులచెరువుకట్టపై రూ.15 లక్షలతో వాకింగ్ ట్రాక్‌ను నిర్మిస్తామని పంచాయతీ ఇన్‌చార్జి కార్యదర్శి వెంకటేశ్వర్లు తెలిపారు. ఎమ్మెల్యే ఏలూరి సూచన మేరకు గురువారం పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు.

టిప్పర్ లారీ బోల్తా.. తప్పిన ప్రమాదం

పర్చూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : టిప్పర్ లారీ బోల్తాపడిన ఘటన బుధవారం కారంచేడు - చీరాల రోడ్డులో చోటుచేసుకుంది. హైవే రోడ్డు నిర్మాణ పనుల్లో భాగంగా తిప్పుతున్న టిప్పర్ లారీ అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న మార్జిన్‌లో బోల్తా పడింది. అయితే ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతితో విషాదఛాయలు

బల్లికురవ, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఎస్ఎల్ గుడిపాడు గ్రామానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి బండ్ల హనుమంతరావు (29) మంగళవారం నర్సరావుపేటలోని లాడ్జీలో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బుధవారం స్వగ్రామం ఎస్ఎల్ గుడిపాడు గ్రామానికి మృతదేహాన్ని తీసుకు వచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. నాలుగు నెలల క్రితం వివాహమైన హనుమంతరావు భార్యను పుట్టింట్లో వదిలి పెట్టి ఆత్మహత్యకు పాల్పడడంతో ఎస్ఎల్ గుడిపాడులో విషాదఛాయలు అలముకున్నాయి. హనుమంతరావు భార్య కూడా భర్త మృతి చెందినట్లు తెలుసుకొని పుట్టింట్లో ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఆమె పరిస్థితి నిలకడగా ఉందని బంధువులు తెలిపారు.

వేర్వేరు రైలు ప్రమాదాల్లో ఇద్దరు మృతి

చీరాల, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : వేర్వేరు చోట్ల జరిగిన రైలు ప్రమాదాల్లో ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు మృతి చెందారు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. బుధవారం రైల్వే స్టేషన్‌కు దక్షిణం వైపు గుర్తుతెలియని వ్యక్తి రైలు ఢీకొని మృతి చెందగా, ఉదయం 10 గంటల సమయంలో ఈపూరుపాలెం సమీపంలో మరో వ్యక్తి రైలు ఢీకొని మృతి చెందాడు. ఈ రెండు ఘటనలపై కేసు నమోదు చేసి, మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు.

పోతినవారిపాలెంలో ట్రాక్టర్ చోరీ

పోతినవారిపాలెం (పర్చూరు), మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : కారంచేడు మండల పరిధిలోని పోతినవారిపాలెం గ్రామంలో ట్రాక్టర్ చోరీ అయిన ఘటన బుధవారం వెలుగులోకి వచ్చింది. గ్రామానికి చెందిన పోతిన బాలకృష్ణ మంగళవారం రాత్రి తన పొలం వద్ద ఉంచిన ట్రాక్టర్‌ను గుర్తుతెలియని వ్యక్తులు అపహరించినట్లు సమాచారం. ఈవిషయమై కారంచేడు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా నిరసన

అద్దంకిటౌన్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా బుధవారం అంబేడ్కర్ విగ్రహం వద్ద మాల మహానాడు, మాల ఉద్యోగుల కమిటీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. బంగ్లా రోడ్డు నుంచి పొట్టి శ్రీరాములు విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. నాయకులు కిరణ్‌కుమార్, కాంతారావు, రాజశేఖర్, శ్రీకృష్ణ, శ్రీనివాసరావు, ఆంజనేయులు, గురవయ్య, వంశీ కృష్ణ, నాగరాజు పాల్గొన్నారు.

గాయత్రి పరివార్ శక్తి పీఠానికి విరాళం

చీరాల, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : గుంటూరు జిల్లా నారా కోడూరులో నూతనంగా నిర్మిస్తున్న గాయత్రి పరివార్ శక్తిపీఠానికి స్థానిక వాకర్స్ అసోసియేషన్ సభ్యులు చెక్క చెన్న నారాయణ రూ.10,116 నగదు అందజేశారు. శక్తి పీఠం స్థానిక ప్రతినిధి దివ్వెల వెంకట రాధాకృష్ణమూర్తికి ఆ నగదును అందజేశారు. వాకర్స్ సభ్యులు రామకృష్ణ, గురుప్రసాద్, వీరాంజనేయులు, రమేష్, పూర్ణా, తిరుపతిరావు పాల్గొన్నారు.



సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరు పత్రాలను అందిస్తున్న టీడీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి మహేంద్రనాథ్

విద్య, వైద్యానికి ప్రాధాన్యం

టీడీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి డాక్టర్ మహేంద్రనాథ్

చీరాల, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు మొదటి ప్రాధాన్యతను ఇస్తుందని టీడీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి డా.మహేంద్రనాథ్ పేర్కొన్నారు. వివిధ ఆరోగ్య సమస్యలు నిమిత్తం వైద్యం పొందిన 36 మందికి ప్రభుత్వం నుంచి విడుదలైన రూ.42లక్షలు విలువగల సిఎం రిలీఫ్ ఫండ్ మంజూరు పత్రాలను బుధవారం క్యాంపు కార్యాలయంలో అందజేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ నిరుపేదలకు కూడా కార్పోరేట్ స్థాయి వైద్యం అందించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు మహేంద్రనాథ్ తెలిపారు. ఆయన వెంట పలువురు నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

మోడల్ కాలేజీలో ప్రవేశాలకు ఆహ్వానం

చీరాల, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : ఏపీ మోడల్ జూనియర్ కళాశాలలో జూనియర్ ఇంటర్ బైపీసీ, ఎంపీసీ, సీఈసీ, ఎంఈసీ విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సరళ ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత కలిగిన వారు ఈనెల 22వ తేదీ లోపు ఆన్‌లైన్ ద్వారా అర్జీలు చేసుకోవాలని వివరాలకు కళాశాల సిబ్బందిని సంప్రదించాలని తెలిపారు.

మణికేశ్వరంలో ప్రత్యేక అధికారి పరిశీలన



గ్రామస్థులతో మాట్లాడుతున్న గుండ్లకమ్మ ప్రాజెక్టు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ విజయజ్యోతి కుమారి

అద్దంకి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : గుండ్లకమ్మ రిజర్వాయర్ ముంపు గ్రామమైన మణికేశ్వరంలో గుండ్లకమ్మ ప్రాజెక్టు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ విజయజ్యోతి కుమారి బుధవారం పరిశీలించారు. పునరావాసకాలనీలో పరిశీలించారు. ఎస్సీ కాలనీలకు భూసేకరణ, ముస్లిం కాలనీ వాసులకు స్థలాల పంపిణీ, పునరావాస కాలనీలో మౌలిక వసతుల కల్పన తదితర అంశాలపై గ్రామస్థులతో చర్చించారు. ఇటీవల మంత్రి రవికుమార్ దృష్టికి మణికేశ్వరం గ్రామస్థులు సమస్యలను తీసుకు పోవడంతో గుండ్లకమ్మ ప్రాజెక్టు అధికారులు బుధవారం పర్యటించారు. గ్రామస్థులు వినతిపత్రం అందజేశారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వరి, టీడీపీ నేతలు కరిముల్లా, నాగయ్య, మీరావలి, బడావలి, ఆదినారాయణ, బలరామిరెడ్డి, రామయ్య, మాధ్యూస్, ప్రసాద్, రఫీ పాల్గొన్నారు.

అధిక ఎరువులతో భూసారానికి దెబ్బ

పంగులూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : పంటసాగులో మోతాదును మించి ఎరువుల వాడకం మంచిది కాదని, అధిక ఎరువుల వినియోగంతో భూసాంద్రత దెబ్బ తింటుందని వ్యవసాయాధికారి డి.సుబ్బారెడ్డి అన్నారు. మండలంలోని నూజెళ్లపల్లి, చందలూరు గ్రామాలలో బుధవారం పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. సాగులో ఉన్న పలు పంటలను రైతులతో కలసి పరిశీలించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మురకొండ సుబ్బారావు, సిబ్బంది లక్ష్మీప్రియ, రైతులు పాల్గొన్నారు

మామిడి పూతలో తెగుళ్లు లేకుండా సాగు చేయాలి

వేటపాలెం (చీరాల), మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : మామిడి పూతలోని తెగుళ్ల సోకకుండా సాగు చేస్తే మంచి దిగుబడలు వస్తాయని ఏవో కాశీ విశ్వనాథ్ పేర్కొన్నారు. పొలంపిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా బుధవారం మండల పరిధిలోని పందిళ్లపల్లి మామిడి సాగును పరిశీలించారు. ఈసందర్భంగా పిందె దశలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో సిబ్బంది అలేఖ్య, కుసుమ, రాజేష్, జశ్వంత్, రైతులు పాల్గొన్నారు

కారంచేడు (పర్చూరు) : పంటల సాగుపై రైతులు అవగాహన పెంచుకోవాలని ఏవో సుధీర్‌బాబు అన్నారు. బుధవారం కారంచేడు మండల పరిధిలోని ఆదిపూడి, యర్రంవారిపాలెం గ్రామాల్లో పొలంపిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా సాగుపై రైతులకు అవగాహన కల్పించారు.

రాయితీపై వ్యవసాయ యంత్ర పరికరాలు

అద్దంకిటౌన్ : రాయితీపై ప్రభుత్వం అందిస్తున్న వ్యవసాయంత్ర పరికరాలను రైతులు సద్వినియోగపర్చుకోవాలని ఏవో కొర్రపాటి వెంకటకృష్ణ తెలిపారు. బుధవారం మండలంలోని తిమ్మయపాలెం గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ 9చెక్కల గొర్రులు, లైవాన్ స్ప్రేయర్లు రాయితీపై అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఈవో కోటేశ్వరరావు, వీఏఏ ఖాజాబీ పాల్గొన్నారు.

వాసవీ ఆధ్వర్యంలో చలివేంద్రం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సభ్యులు

అద్దంకిటౌన్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం పాత ఆంధ్రాబ్యాంక్ ఎదురుగా చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ చలివేంద్రాన్ని ముఖ్య అతిథిగా హాజరైన కొత్తమాస తాతయ్య ప్రారంభించారు. కార్యక్రమంలో క్లబ్ ఇంటర్నేషనల్ జాయింట్ సెక్రటరీ ఉమా అన్నపూర్ణ, రీజనల్ చైర్మన్ రాజా, రీజనల్ సెక్రటరీ గుణశేఖర్, జోన్ చైర్మన్ వీ ఆదినారాయణ, క్లబ్ ప్రెసిడెంట్ నాగండ్ల వెంకట రమణ, సెక్రటరీ తాతా హరిబాబు, ట్రెజరర్ వేముల జయరాం, టి. శ్రీనివాసరావు, కౌన్సిలర్ రమేష్, సుబ్బయ్య పాల్గొన్నారు.

సోలార్ పవర్ ఉత్పత్తికి ప్రతిపాదనలు

విద్యుత్ శాఖ ఈఈ మస్తాన్‌రావు



సమావేశంలో అధికారులతో మాట్లాడుతున్న విద్యుత్ ఈఈ మస్తాన్‌రావు

అద్దంకి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : సోలార్ విద్యుత్ ఉత్పత్తికి అనువైన 12 సబ్ స్టేషన్‌లను గుర్తించి ప్రతిపాదనలు పంపినట్లు ఈఈ నల్లూరి మస్తాన్‌రావు అన్నారు. అద్దంకి డివిజన్ పరిధిలోని డీఈఈలు, ఏఈలు, సబ్ ఇంజనీర్‌లతో బుధవారం ఈఈ మస్తాన్‌రావు, అకౌంట్స్ ఆఫీసర్ శ్రీనివాసరెడ్డి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మస్తాన్‌రావు మాట్లాడుతూ ప్రధానమంత్రి కిసాన్ ఊర్జా సురక్ష ఏవం ఉద్దాన్ మహాభియాన్ యోజన పథకంలో భాగంగా ఫీడర్ సోలరైజేషన్ ప్లాంట్‌లు ఏర్పాటు చేసి వ్యవసాయ విద్యుత్ వినియోగం ఉన్న 11కేవీ ఫీడర్‌కు అనుసంధానించడం జరుగుతుందన్నారు. అద్దంకి డివిజన్ పరిధిలోని ముప్పవరం, ధర్మవరం, కుంకుపాడు, శంఖవరప్పాడు, సాధునగర్, కొమ్మాలపాడు, వి.కొప్పెరపాడు, వల్లాపల్లి, కొమ్మినేనివారిపాలెం, ఉప్పమాగులూరు, బల్లికురవ, వెలమవారిపాలెం సబ్‌స్టేషన్‌లను ఎంపిక చేసి 20 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి ప్రతిపాదనలు పంపినట్లు చెప్పారు. సోలార్ ప్లాంట్ నిర్మాణం ఒక్కో మెగా వాట్‌కు 4.5 ఎకరాల భూమి అవసరం అవుతుందన్నారు. ప్రభుత్వ భూమి అందుబాటులో లేని చోట రైతుల నుంచి కౌలుకు తీసుకోవడం జరుగుతుందన్నారు. టెండర్‌లు పూర్తయిన వెంటనే పనులు ప్రారంభిస్తామని తెలిపారు.

50శాతం రాయితీపై అధికలోడు క్రమబద్ధీకరణకు అవకాశం

గృహ వివియోగానికి సంబంధించి అధిక లోడు ను 50 శాతం రాయితీతో క్రమబద్ధీకరించుకునేందుకు ఏపీ ఈఆర్‌సీ అవకాశం కల్పించదని ఈఈ మస్తాన్‌రావు తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగదారులు వినియోగించుకోవాలన్నారు.

ఒక కిలోవాట్‌కు 2350 రూపాయలు చెల్లించాల్సి ఉండగా, 50 శాతం రాయితీతో 1250 రూపాయలు చెల్లిస్తే సరిపోతుందన్నారు. 5 కిలో వాట్‌ల లోపు అయితే స్థానిక విద్యుత్ కార్యాలయంలోని కౌంటర్‌లో, అంతకు మించితే మీ సేవా కేం ద్రాలలో చెల్లించాలని తెలిపారు. ఈ అవకాశం జూన్ 30వ తేదీ వరకు ఉంటుందన్నారు.అధికారులు క్షేత్ర స్థాయిలో వినియోగదారులలో మరింత అవగాహన కల్పించాలని కోరారు. ఈ సమావేశంలో డీఈఈలు దామోదర్, సురేం ద్రబాబు, ఈఆర్‌వో కార్యాలయాల ఏఏవోలు శ్రీనివాసులు, శ్రీనివాసరావు, డివిజన్ పరిధిలోని ఎఈలు, సబ్ ఇంజనీర్ లు పాల్గొన్నారు.



నగదును అందజేస్తున్న మద్దిపాడుకు చెందిన అనందకుమార్, పద్మావతి దంపతులు

శింగరకొండ ముఖమండపానికి రూ.లక్ష విరాళం

అద్దంకి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం రాతి ముఖ మండపం పునఃనిర్మాణ పనులకు మద్దిపాడుకు చెందిన యండ్రపాటి ఆనందకుమార్, పద్మావతి దంపతులు రూ.1,01,116 విరాళాన్ని బుధవారం అందజేశారు. అనంతరం ప్రత్యేక పూజలలో పాల్గొన్నారు.

సబ్సిడీ రుణాలకు దరఖాస్తు చేసుకోవాలి

అద్దంకి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : అద్దంకి పట్టణం పరిధిలోని బీసీ, ఈడబ్ల్యూఎస్, కాపు కులాలకు చెందిన వ్యక్తులు చంద్రన్న స్వయం ఉపాధి పథకం కింద రుణాలు, కుట్టు మిషన్‌లు పొందేందుకు ఈనెల 22లోపు దరఖాస్తు చేసుకోవాలని కమిషనర్ రవీంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్ లేదా సమీప సచివాలయాల్లో పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు.

గ్రీన్‌ఫీల్డ్ పోర్ట్ ఏర్పాటుకు ముందడుగు

ఎమ్మెల్యే ఏలూరి

చినగంజాం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : చినగంజాం మండలంలో గ్రీన్ ఫీల్డ్ పోర్ట్, నౌకాశ్రయం తయారీ భారీ యూనిట్ ఏర్పాటుకు ముందడుగు పడిందని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు తెలిపారు. ఇప్పటికే దీని ఆవశ్యకతపై కేంద్ర మంత్రికి లేఖ రాశామని పేర్కొన్నారు. ఈ యూనిట్ ఏర్పాటుకు కేంద్రమంత్రి సర్బానందసోనోవాల్ సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే తెలిపారు. మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి కృషి చేయడం పట్ల ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. ఈ పరిశ్రమతో ఈ ప్రాంత రూపురేఖలు మారతాయన్నారు. నిరుద్యోగులకు పెద్ద ఎత్తున ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి పర్చూరు నియోజకవర్గం దిక్సూచిగా మారుతుందన్నారు. వేలాదిమందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. రవాణా వ్యవస్థ మెరుగుపడవంతోపాటు పలు పరిశ్రమలు వచ్చే అవకాశం ఉందని ఎమ్మెల్యే ఏలూరి తెలిపారు.

వైభవంగా రామలింగేశ్వరస్వామి తిరునాళ్ల



టీడీపీ ఏర్పాటు చేసిన విద్యుత్ ప్రభ

బల్లికురవ, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఉప్పుమాగులూరు గ్రామంలో ఉన్న శ్రీ రామలింగేశ్వర స్వామి వారి వార్షిక తిరునాళ్ల బుధవారం వైభవంగా జరిగింది. గ్రామానికి సమీప కొండ ప్రాం తంలో ఉన్న పురాతన కాలం నుంచి ఉన్న రామలింగేశ్వర స్వామి తిరునాళ్ల సందర్భంగా భక్తులు పెద్ద ఎత్తున దేవాలయానికి చేరి ప్రత్యేక అభిషేకాలలో పాల్గొన్నా రు. గ్రామస్థులు సమష్టి కృషితో దేవాలయం వద్ద ఉదయం నుంచి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. తిరునాళ్లలో భాగంగా టీడీపీ ఆధ్వర్యంలో విద్యుత్ ప్రభను ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. గ్రామ పరిసర గ్రామాలకు చెందిన భక్తులు తిరునాళ్లకు తరలి వచ్చారు. బల్లికురవ ఎస్ఐ జీవీ చౌదరి తిరునాళ్లలో ప్రత్యేక బందోబస్తు నిర్వహించారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

- ఐదుగురికి తీవ్ర గాయాలు
- ముప్పవరం నుంచి కూలి పనుల కోసం వెళ్తుండగా ఘటన



షేక్ అషీర్ బీ మృతదేహం | అషీర్ బీ (ఫైల్)

పంగులూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అలవలపాడు గ్రామ అడ్డరోడ్డు సమీపం జాతీయ రహదారిపై బుధవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందగా ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. మరికొందరు స్వల్పగాయాలతో బయటపడ్డారు. ప్రమాదం బారిన పడిన మహిళలు ముప్పవరం గ్రామానికి చెందిన మహిళా కూలీలు. వీరిలో షేక్ అషీర్ బీ (60) మార్టూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలిస్తుండగా మృతి చెందింది. రేణంగివరం ఎస్ఐ వినోద్‌బాబు సమాచారం మేరకు.. ముప్పవరం గ్రామానికి చెందిన మహిళా కూలీలు ఆటోలో బుధవారం ఉదయం 5 గంటల సమయంలో మిరప కోతలకు రావినూతలకు బయలు దేరారు. అదే రోడ్డుపై గుంటూరు వైపు వెళ్తున్న గుర్తుతెలియని లారీ అత్యవసర ల్యాండింగ్ రోడ్డు మధ్య భాగంలో అమర్చిన దిమ్మెను ఢీకొట్టగా ఆ దిమ్మె ఒంగోలువైపు వెళ్లే రోడ్డులో పడి పోయింది. ఈ రహదారిలో మహిళా కూలీలతో వెలుతున్న ఆటో డ్రైవర్ రోడ్డుపై పడి ఉన్న దిమ్మెను గుర్తించక ఢీకొట్టడంతో ఈ ఘటన జరిగింది. ఈ ప్రమాదంలో షేక్ అషీర్‌బీ మృతి చెందగా, దాసరి పుష్పాలు, కొమ్ము పాపమ్మ, చింతల లక్ష్మీ, వరపర్ల భారతి, కొమ్ము సలోమీలకు తీవ్ర గాయాలు కాగా మిగిలిన వారు సల్ప గాయాలతో బయటపడ్డారు. గాయాలైన ఐదుగురు మహిళలను చికిత్స నిమిత్తం హైవే అంబులెన్స్‌లో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం వెంకటరమణ హాస్పటల్స్‌కు తరలలించారు. ఆటో నడుపుతున్న నందిపాగు ఇమానియేల్ శ్వాస తీసుకోవడం ఇబ్బందిగా ఉందనడంతో గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలిలించినట్లు ఎస్ఐ తెలిపారు. అషీర్ బీ మృత దేహానికి మార్టూరు ప్రభుత్వ వైద్యశాలలో పోస్టుమార్టం నిర్వహిస్తున్నామని, ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వినోద్‌బాబు తెలిపారు.

బాధితులను పరామర్శించిన మంత్రి గొట్టిపాటి

రోడ్డు ప్రమాదంపై మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పందించారు. సమాచారం తెలుసుకున్న మంత్రి గొట్టిపాటి ఘటనలో ప్రాణాలు కోల్పోయిన షేక్ అషీర్ బీ కుటుంబ సభ్యులను ఫోన్ ద్వారా పరామర్శించారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామన్నారు. ఈ ఘటనలో క్షతగాత్రులైన మహిళలను మంత్రి గొట్టిపాటి ఫోన్ ద్వారా పరామర్శించి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. గాయపడిన వారికి మెరుగైన చికిత్స అందించాలని వైద్యులకు సూచించారు. బాధితులను ముప్పవరం టీడీపీ నేతలు కుక్కపల్లి ఏడుకొండలు, ఎస్.సి. సెల్ అధ్యక్షులు వరపర్ల సుబాబరావు, చింతల సహదేవుడు శ్రీనివాసరావు పరామర్శించారు.